- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

శనివారం
06-06-2026

సంపుటి : 01 సంచిక :75 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 75 NAMASTEY MAHAAPRABHA



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha



## భారత జీడీపీ వృద్ధి రేటు 7.7 శాతం

- అంతర్జాతీయ సవాళ్ల మధ్య భారత్ వృద్ధి జోరు
- చివరి త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి
- తయారీ, సేవల రంగాలే వృద్ధికి ప్రధాన బలం
- వ్యవసాయం, మత్స్య రంగాల నుంచి కూడా కీలక తోడ్పాటు
- రూ.323 లక్షల కోట్లకు చేరిన స్థూల దేశీయోత్పత్తి
- నామమాత్ర జీడీపీ వృద్ధి 8.9 శాతానికి పెరుగుదల
- ప్రపంచ ఆర్థిక అనిశ్చితుల్లోనూ భారత్ సత్తా
- ఆర్థిక బలాన్ని చాటిన తాజా జీడీపీ గణాంకాలు

గత ఏడాదితో పోలిస్తే వేగంగా పుంజుకున్న ఆర్థిక వ్యవస్థ

3 లో



## పాలన చేతగాక పోతే రాజీనామా చేయండి

- ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక లేకుంటే ఎలా
- కేంద్రాన్ని తిడుతూ సమస్యలను దాటవేస్తారా
- సిఎం రేవంత్‌పై మండిపడ్డ ఎంపి అర్వింద్

**హైదరాబాద్ జూన్ 5 మహాప్రభ**

పాలన చేతకాకపోతే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్.. సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ, బీజేపీ నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తామని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని అన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి రైతుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి రాజకీయాలు చేయడం తగదని అరవింద్ వ్యాఖ్యానించారు. ఇది సిఎంగా ఆయన వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. వరికోతలు ప్రారంభమయ్యే ముందే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా

-మిగతా 3 లో



## మణిపూర్‌లో మళ్లీ భగ్గుమన్న హింస

- గ్రామంపై మిలిటెంట్ల దాడి.. ముగ్గురు మృతి
- విచక్షణారహిత కాల్పులు, ఇళ్లకు నిప్పంటింపు
- ఉద్రిక్తతలతో భయాందోళనలో గ్రామస్తులు
- ఘటనాస్థలికి చేరుకున్న భద్రతా దళాలు
- దుండగుల కోసం విస్తృత గాలింపు
- కాల్పులు, అగ్నికాండతో ఉద్రిక్తంగా ప్రాంతం
- ప్రభావిత ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం
- తెల్లవారుజామున దాడితో కలకలం
- పరిస్థితిపై నిరంతర నిఘా: అధికారులు

**ఇంఫాల్ జూన్ 5 మహాప్రభ**

మణిపూర్‌లో మళ్లీ హింస చెలరేగింది. సాయుధ దుండగులు ఒక గ్రామంపై దాడి చేశారు. పలువురిపై కాల్పులు జరిపారు. పలు ఇళ్లకు నిప్పంటించారు. దుండగుల కాల్పుల్లో ముగ్గురు వ్యక్తులు మరణించారు. భద్రతా దళాలు ఆ ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని పరిశీలిస్తున్నాయి. కాంగ్‌పోక్పి జిల్లాలో న్యూ కీథెల్మాన్బి ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున 4.10 గంటల సమయంలో సాయుధులైన దుండగులు లోయిబోల్ గ్రామంపై దాడి చేశారు. సాయుధ మిలిటెంట్లు విచక్షణారహితంగా కాల్పులు జరుపడంతో ముగ్గురు వ్యక్తులు మరణించారు. పలు ఇళ్లకు వారు నిప్పంటించగా అవి కాలి బూడిదయ్యాయి. ఈ సంఘటనతో ఆ గ్రామంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి.కాగా,

-మిగతా 3 లో

## మీ పదేళ్ల పాలన.... నా రెండున్నరేళ్ల పాలనపై

# చర్చిద్దామా

### కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి సవాల్

- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిన చోట మీరు ఓట్లు అడగండి
- ఇందిరమ్మ ఇళ్లు కట్టిన దగ్గర మేం ఓట్లు అడుగుతాం
- ఎంపిగా గెలిపిస్తే పాలమూరు ఒరగబెట్టిందేమీ లేదు
- మీకు డిపాజిట్లు వస్తే.. నా పేరు మార్చుకుంటా
- నిలిచిపోయిన ప్రాజెక్టుల పునరుద్ధరణెళి మా లక్ష్యం
- జడ్చర్ల సభలో కెసిఆర్‌కు సిఎం రేవంత్ సవాల్

**జడ్చర్ల జూన్ 5 మహాప్రభ**

నీ పదేళ్ల పాలన.. నా రెండున్నరేళ్ల పాలనపై చర్చకు సిద్ధమా? అంటూ కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. నీ పేరు కేసీఆర్ అయితే చర్చకు రా.. ఈ చర్చలో ఓడితే తాను దేనికైనా సిద్ధమని కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం జడ్చర్ల పరజాపాలన-ప్రగతి ప్రణాళిక సభ వేదికపై నుంచి నిప్పులు చెరిగారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిన చోట మీరు ఓట్లు అడగండని కేసీఆర్‌కు సీఎం రేవంత్ సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు కట్టిన దగ్గర మేం ఓట్లు

-మిగతా 3 లో



## ఆసక్తికరంగా తమిళనాడు రాజకీయాలు

- కొత్త పార్టీ పెటట్టబోతున్న అన్నామలై
- ప్రజలు లక్ష్యంగా రాజకీయ పార్టీని నడిపిస్తా
- బిజెపికి భారం కాకూడదనే బయటకు వచ్చా
- ఒంటరిగా పోటీచేయాలన్న తనవాదనను పట్టించుకోని బిజెపి
- గతంలో రజనీకాంత్ సార్ తనతో కలవమని కోరారు
- మీడియా సమావేశంలో మాజీ బిజెపి నేత అన్నామలై



3 లో

## భారత్‌పై ఒత్తిడి తేవడంలో అమెరికా విఫలం:

- భారత్ స్వతంత్ర విదేశాంగ విధానాన్ని కొనియాడిన పుతిన్
- భారత్‌తో సంబంధాల విస్తరణకు రష్యా సిద్ధం
- ప్రపంచ ఆర్థిక శక్తిగా భారత్ ఎదుగుతోందన్న రష్యా అధ్యక్షుడు
- ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత పెంచుతాం
- భారత్‌పై పాశ్చాత్య ఒత్తిడి బూమరాంగ్ అవుతుందని హెచ్చరిక
- మోదీపై ఒత్తిడి తెస్తే అంతర్జాతీయ సంబంధాలకే నష్టం
- భారత్-రష్యా ఆర్థిక భాగస్వామ్యానికి కొత్త ఊపు
- ప్రపంచ వేదికపై భారత్ ప్రభావం పెరుగుతోందన్న పుతిన్ వ్యాఖ్యలు



3 లో



## 'దేశంలో కొంతమంది నిరాశావాదులున్నారు..

- వారి పన్నాగాలను ప్రజలు తిప్పికొడుతున్నారు'
- సూరత్ బహిరంగ సభలో కాంగ్రెస్, రాహుల్ గాంధీలపై ప్రధాని మోదీ పరోక్ష ధ్వజం
- 'ఆత్మనిర్భర్ భారత్' సంకల్పాన్ని విమర్శించడమే కొందరికి పనిగా మారిందని ఆక్షేపణ
- హిమాచల్, హర్యానా స్థానిక ఎన్నికల ఫలితాలే కాంగ్రెస్ వైఫల్యాలకు నిదర్శనం
- అల్లకల్లోలం సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలనే వ్యూహాలు ఎప్పటికీ సాగవు
- సూరత్‌లో రూ. 18,800 కోట్ల విలువైన ప్రగతి పనులకు ప్రధానమంత్రి శంకుస్థాపన

3 లో

## తట్టెడు మట్టి తీయలేదు

- ఆనాడు కేసులు వేసి పాలమూరుకు అడ్డం పడింది నువ్వే కాదా
- మీరెన్ని కేసులు వేసినా.. మేం 27,191 ఎకరాలు సేకరించాం
- ఈ రెండున్నరేళ్లలో మీరు ఒక్క ఎకరమైనా సేకరించారా?
- అబద్ధాలతో ఇంకెన్నాళ్లు ప్రభుత్వాన్ని నడుపుతారు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఫైర్



**హైదరాబాద్ జూన్ 5 మహాప్రభ**

రెండున్నరేళ్ల పాటు సమయాన్ని వృధా చేసి ,సగం పాలనా కాలం పూర్తయిన తర్వాత ఇప్పుడు కుంభకర్ణ నిద్ర లేచి ముఖ్యమంత్రి.. భూసేకరణకు ప్రతిపాదనలు అనడం సిగ్గుచేటని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే రేవంత్ రెడ్డి రెండున్నరేళ్ల పాలనలో ఉమ్మడి పాలమూరు జిల్లాకు చేసింది గుండు సున్నా అని విరుచుకుపడ్డారు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు అబద్ధాలు, అభూతకల్పనల ప్రచారం చేస్తున్నాడంటూ సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు హరీశ్ రావు తన ఎక్స్ ఖాతాలో

-మిగతా 3 లో



## ఏఐతో టీకా అభివృద్ధి..

- పలు వైరస్‌లను అడ్డుకొనేలా తయారీ
- ప్రపంచంలోనే తొలిసారిగా యూకేలో

**లండన్**

యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్‌లోని ఒక బృందం ప్రపంచంలోనే తొలిసారిగా పూర్తిగా ఏఐను ఉపయోగించి టీకాను అభివృద్ధి చేసింది. ఈ టీకాను మనుషులపై ప్రయోగించినట్టు వెల్లడించింది. ఈ టీకాను అన్ని రకాల కరోనా వైరస్‌లు, మహమ్మారులు, జంతువులకు సోకే వైరస్‌లు, భవిష్యత్తులో మరో మహమ్మారిని సృష్టించే సామర్థ్యం ఉన్న వైరస్‌లను నిరోధించేందుకు ఉపయోగించవచ్చని ఆ బృందం తెలిపింది.అయితే ఈ వ్యాక్సిన్ ఇంకా ప్రారంభ దశలోనే ఉందని.. కానీ తాము దీన్ని పోలిన టీకాలను ఇప్పటికే అభివృద్ధి చేశామని.. అవి ఫ్లూ, ఎబోలాను నిరోధించవచ్చని వెల్లడించింది. కరోనా వైరస్‌ల నుంచి సేకరించిన జన్యు సంకేతాలను విశ్లేషించి ఈ కొత్త టీకాను తయారు చేశారు. వైరస్‌ల కుటుంబం రూపాంతరం చెందినా వాటి నుంచి రక్షణ లభించేలా సూపర్-యాంటీజెన్ లాగా రూపొందించారు.

## బిఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం

- నిధులు,నియామకాలు, నీళ్లలో వైఫల్యం
- బిజెపి కోసం ప్రజలు ఆశగా చూస్తున్నారు
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**మహబూబాబాద్, జూన్ 5 మహాప్రభ**

తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. శుక్రవారం బీజేపీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో రాంచందర్‌రావు పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో నిధులు, నియామకాలు, సాగునీటి వ్యవస్థల్లో వైఫల్యాలు జరిగాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. అవినీతి, నిర్లక్ష్యంతో

-మిగతా 3 లో



# జైపూర్‌లో ఎబోలా కేసు..

**-ఐసోలేషన్‌లో ఉగాండా మహిళ**



**జైపూర్ జూన్ 5 మహాప్రభ**
ఎబోలా వైరస్ లక్షణాలు ఉన్న ఉగాండా మహిళ రాజస్థాన్ చేరుకున్నది. ఆ మహిళను జైపూర్ ఆస్పత్రికి తరలించారు. విమానాశ్రయంలో ఎమర్జెన్సీ చెకింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఆమె ఎబోలా లక్షణాలతో బాధపడుతున్నట్లు తెలిసింది. దీంతో ఆరోగ్యశాఖ అధికారులు ఆమెను తక్షణమే నగరంలో ఆర్‌యూహెచ్‌ఎస్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. షార్జా నుంచి ఆమె శుక్రవారం జైపూర్ చేరుకున్నది. కఠినమైన ఐసోలేషన్‌లో ఆమెకు చికిత్సను అందిస్తున్నారు. ఆ మహిళ నుంచి శ్యాంపిళ్లను సేకరించి.. తదుపరి విశ్లేషణ కోసం పుణె ల్యాబ్‌కు పంపారు.ప్రమాదకర ఎబోలా వైరస్‌తో పోలిన లక్షణాలు కనిపించడంతో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. అయితే ఆమెలో ఎబోలా ఇంకా నిర్ధారణ కాలేదని రాజస్థాన్ వైద్య కళాశాల సూపరిండెంట్ అనిల్ గుప్తా తెలిపారు. రిపోర్టు అందిన తర్వాతే ఇన్‌ఫెక్షన్ నిర్ధారణ జరుగుతుందన్నారు. అయితే హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో గురువారం ఓ సుడాన్ వ్యక్తిని కూడా ఎబోలా అనుమానంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అంతర్జాతీయ ప్రయాణికులు నిర్వహిస్తున్న థర్మల్ స్క్రీనింగ్‌లో ఆ వ్యక్తి జ్వరంతో బాధపడుతున్నట్లు తెలిసింది. కాంగో, ఉగాండా, దక్షిణ సుడాన్ దేశాలకు ప్రయాణాలను రద్దు చేసుకోవాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే.

# బీహార్‌లో మాజీ సీఎంలు లాలూ, రబ్రీదేవికి జెడ్ ప్లస్ భద్రత ఉపసంహరణ



**న్యూఢిల్లీ జూన్ 5 మహాప్రభ**
బీహార్ ప్రభుత్వం రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రులు, ఆర్‌జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీ దేవిలకు కల్పిస్తున్న అత్యున్నత స్థాయి జెడ్-ప్లస్ భద్రతను ఉపసంహరించుకుంది. వీఐపీ భద్రతపై జరిపిన సమీక్షల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. జనశక్తి జనతా దళ్ (జేజేడీ) అధినేత, ఆర్జేడీ అధినేత లాలూ యాదవ్ పెద్ద కుమారుడు అయిన తేజ్ ప్రతాప్‌కు కల్పిస్తున్న వై-కేటగిరీ భద్రతను కూడా ఉపసంహరించుకున్నట్లు అధికారులు తెలిపారు.లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీ దేవిలకు ఇకపై బీహార్ ప్రత్యేక సాయుధ పోలీసులు (బీఎస్‌ఏపీ) భద్రత కల్పిస్తారు. ప్రతిపక్ష నాయకుడు తేజస్వి యాదవ్‌కు కల్పించిన వై-ప్లస్ భద్రతను బీహార్ ప్రభుత్వం కొనసాగిస్తోందని అధికారులు తెలిపారు. లాలూ యాదవ్ పెద్ద కుమార్తె, ఎంపీ మీసా భారతికి, తేజస్వి యాదవ్ భార్య రాజశ్రీ యాదవ్‌కు ఉన్న ప్రస్తుత భద్రతా ఏర్పాట్లు కొనసాగుతాయని ఓ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

# మోటార్ల చోరీపై రైతుల ఆందోళన..

**-క్యూఆర్ కోడ్ ద్వారా డబ్బులు చెల్లిస్తామని దొంగలకు వినతి**




**చండీగఢ్ జూన్ 5 మహాప్రభ**
పొలాల్లోని మోటార్లను దొంగలు చోరీ చేయడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో మోటార్లను కాపాడుకునేందుకు క్యూఆర్ కోడ్ ద్వారా దొంగలకు డబ్బు చెల్లిస్తామని రైతులు వేడుకుంటున్నారు. పంజాబ్‌లోని ఫరీద్‌కోట్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. తమ పొలాల్లోని వ్యవసాయ మోటార్లు చోరీ కావడంపై పాఖీ కలాన్ గ్రామానికి చెందిన రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు నెలల కిందట ఒక్క రాత్రిలోనే పొలాల నుంచి సుమారు 15 మోటార్లు చోరీ అయ్యాయి. తాజాగా మళ్లీ సుమారు 25 మోటార్లు దొంగతనానికి గురయ్యాయి.కాగా, మోటార్ల చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో ఆ గ్రామ రైతులు అసాధారణ నిర్ణయం తీసుకున్నారు. తమ పొలాల్లోని మోటార్లను దొంగించవద్దని, దానికి బదులుగా క్యూఆర్ కోడ్ డిజిటల్ పేమెంట్ స్కానర్ ద్వారా డబ్బులు తీసుకోవాలని దొంగలను కోరారు. ఈ మేరకు తమ పొలాల వద్ద ఒక బ్యానర్ ఏర్పాటు చేశారు. ఈ బ్యానర్ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# డీకే శివకుమార్‌కు జలక్..

**రాజీనామా చేసిన మంత్రి రామలింగా రెడ్డి**



**బెంగళూరు జూన్ 5 మహాప్రభ**
కర్ణాటకలో కొత్తగా ఏర్పాటైన సీఎం డీకే శివకుమార్ మంత్రివర్గానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బుధవారం మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సీనియర్ కాంగ్రెస్ నేత, ఎనిమిది సార్లు ఎమ్మెల్యే రామలింగారెడ్డి కేవలం రెండు రోజులకే తన పదవికి రాజీనామా చేశారు. శుక్రవారం ఆయన తన రాజీనామా లేఖను సమర్పించారు. ఖాతాల కేటాయింపుల్లో జరిగిన అవమానాన్ని తాను భరించలేనని, తన అంతరాత్మకు వ్యతిరేకంగా పనిచేయలేనని రామలింగారెడ్డి స్పష్టం చేశారు. తనకు బెంగళూరు నగర అభివృద్ధి (బెంగళూరు అర్బన్) శాఖను అప్పగిస్తానని డీకే శివకుమార్ గతంలో స్వయంగా తన ఇంటికి వచ్చి రెండుసార్లు హామీ ఇచ్చారని, కానీ చివరకు తనకు ఇష్టం లేని నీటిపారుదల (ఇరిగేషన్) శాఖను కేటాయించారని ఆయన ఆరోపించారు. ఇప్పుడు ఒకవేళ బెంగళూరు పోర్ట్‌ఫోలియో ఇచ్చినా తాను మంత్రి పదవిని తీసుకోబోనని, కేవలం ఎమ్మెల్యేగానే కొనసాగుతూ కాంగ్రెస్ పార్టీలోనే ఉంటానని స్పష్టం చేశారు. మరోవైపు ఈ పరిణామంపై సీఎం డీకే శివకుమార్ స్పందిస్తూ.. రామలింగారెడ్డి తనకు అత్యంత ఆప్తమిత్రుడని, సీనియర్ నేత అయిన ఆయన అసంతృప్తిని త్వరలోనే చర్చల ద్వారా పరిష్కరిస్తామని వెల్లడించారు.

# మహారాష్ట్రలో రూ.2 లక్షల వరకు వ్యవసాయ రుణాలు మాఫీ..

**56 లక్షల మంది రైతులకు లబ్ధి**



**న్యూఢిల్లీ జూన్ 5 మహాప్రభ**
మహారాష్ట్రలోని రైతులకు ఊరట కలిగేలా దేవేంద్ర ఫడ్నవీస్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రైతులకు రూ.2 లక్షల వరకు వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలని మహారాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించింది. 'పుణ్యశ్లోక్ అహిల్యాదేవి హోల్కర్ షేట్కారి కర్జ్‌ముక్తి యోజన' పథకం కింద ఈ మాఫీ జరగనుంది. ఈ నిర్ణయం వల్ల మహారాష్ట్రలోని 56 లక్షల మంది రైతులకు మేలు జరగనుంది. దీనివల్ల మొత్తం 65 లక్షల వరకు రుణాలు మాఫీ అవుతాయి.ఇందుకోసం ప్రభుత్వం రూ.36,585 కోట్లు కేటాయించనుంది. ఒకవేళ రైతులు ఇప్పటికే రుణాలు చెల్లించి ఉంటే వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. వీరికి రూ.50 వేల వరకు సాయం అందనుంది. అసలు, వడ్డీ కలిపి రూ.2 లక్షల వరకు రైతుల వ్యవసాయ రుణాలు మాఫీ అవుతాయి. ఇందుకోసం భూయాజమాన్య డాక్యుమెంట్లు వంటివేమీ అక్కర్లేదు. రూ.2 లక్షలకు మించి రుణాలు ఉన్నవారికి కూడా ఈ పథకం వర్తిస్తుంది. అయితే, వారు అదనపు డబ్బు ముందుగానే బ్యాంకులకు చెల్లించాలి. అంటే రూ.2 లక్షలకంటే ఎంత ఎక్కువగా లోన్ తీసుకుంటే అందులో రూ.2 లక్షలు మినహాయించి మిగిలిన డబ్బు చెల్లించాలి. ఒక రైతు రూ.3 లక్షల రుణం తీసుకుంటే అతడు ముందుగా రూ.1 లక్ష రుణం బ్యాంకుకు చెల్లించాలి. అప్పుడు మిగతా రూ.2 లక్షల్ని ప్రభుత్వం చెల్లిస్తుంది. వచ్చే ఏడాది మార్చి 31 లోపు అదనపు రుణం చెల్లించిన వారికి మాత్రమే ప్రభుత్వ రుణమాఫీ వర్తిస్తుంది. ఏప్రిల్ 1, 2019 నుంచి మార్చి 31, 2025 వరకు రుణం తీసుకున్నవారికి మాత్రమే రుణమాఫీ వర్తిస్తుంది. 2025 మార్చి 30 నాటికి ఉన్న రుణాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. అలాగే, ఈ ఏడాది మార్చి 31 లోపు రుణం చెల్లించి ఉండకూడదు. మహారాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై అక్కడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులో కూడా కొత్తగా అధికారం చేపట్టిన సీఎం విజయ్.. అక్కడి రైతులకు రూ.50 వేల వరకు రుణమాఫీ ప్రకటించారు. అధికారకంగా ఏ పదవిలోనైనా ఉన్నా, లేదా రాజకీయ పదవుల్లో ఉన్నా ఈ పథకం వర్తించదు. అలాగే, ప్రభుత్వ ఉద్యోగులకు, ఆదాయపు పన్ను చెల్లించేవారికి, నెలకు రూ.25,000కు పైగా వేతనం పొందుతున్న సహకార సంస్థల సిబ్బందికి కూడా రుణమాఫీ వర్తించదు

# లోక్‌సభ ఎంపీగా పోటీ చేయనున్న మమత..

**అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో కీలక నిర్ణయం**



**న్యూఢిల్లీ జూన్ 5 మహాప్రభ**
పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ లోక్‌సభపై దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో పార్టీ ఘోర ఓటమి తర్వాత ఆమె చూపు పార్లమెంట్‌వైపు పడినట్లు సమాచారం. దీంతో త్వరలోనే ఆమె లోక్‌సభకు పోటీ చేయనుందని పార్టీ వర్గాలు అంటున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో గత ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో టీఎంసీ ఘోర పరాజయం పాలై, అధికారం కోల్పోయింది. మమతా బెనర్జీయే అసెంబ్లీ సీటును గెల్చుకోలేకపోయింది.అటు పార్టీ పరాజయం, ఇటు తాను ఎమ్మెల్యేగా ఓడిపోయిన నేపథ్యంలో రాష్ట్రంలో ఉండటం కంటే ఢిల్లీయే బెటర్ అని మమతా భావిస్తోంది. అందుకే పార్లమెంట్‌వైపు చూస్తున్నారు. లోక్‌సభకు తిరిగి ఎంపీగా వెళ్లాలనుకుంటున్నారు. అయితే, ఇప్పుడేమీ ఎన్నికలు లేవు. ఉప ఎన్నికలూ లేవు. మరెలా..? దీనికి సమాధానం ప్రస్తుతం టీఎంసీ తరఫున ఎంపీగా కొనసాగుతున్న యూసుఫ్ పఠాన్. మాజీ క్రికెటర్ అయిన యూసుఫ్ పఠాన్ 2024లో జరిగిన ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లోని బహరాంపూర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఆయన టీఎంసీ తరఫున లోక్‌సభ ఎంపీగా గెలుపొందారు. కాంగ్రెస్ అగ్రనేత అధిర్ రంజాన్ చౌదరిని భారీ మెజారిటీతో ఓడించారు.అయితే, ఇప్పుడు ఆ స్థానం నుంచి మమత పోటీ చేయాలనుకుంటున్నారు. ఇందుకోసం ఆ సీటు నుంచి రాజీనామా చేయాలని యూసుఫ్ పఠాన్‌కు మమత సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. దీనికి ఆయన కూడా సానుకూలంగానే ఉన్నారని తెలుస్తోంది. ఇదే జరిగితే, అక్కడ జరిగే ఉప ఎన్నికలో టీఎంసీ తరఫున మమతా బెనర్జీ పోటీ చేస్తారు. మమతా బెనర్జీ గతంలో కూడా ఎంపీగా పనిచేశారు. 1974 నుంచి ఆరుసార్లు కోల్‌కతా సౌత్ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలిచారు. 1984లో తొలిసారి జాధవ్‌పూర్ నుంచి కాంగ్రెస్ తరఫున ఎంపీగా గెలిచారు. అనంతరం 1989లో ఓడిపోయారు.తర్వాత కోల్‌కతా సౌత్ (ప్రస్తుతం కోల్‌కతా దక్షిణ్) నియోజకవర్గం నుంచి 1991, 1996లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలిచారు. అనంతరం ఆమె కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి, సొంత పార్టీ టీఎంసీని స్థాపించారు. 1998, 1999, 2004, 2009లో ఎంపీగా గెలిచారు. మరి యూసుఫ్ పఠాన్ రాజీనామా చేస్తే ఆ స్థానం నుంచి పోటీ చేసి గెలుస్తారా లేదా అనేది చూడాలి.

# టీనేజ్ కుమార్తెపై తండ్రి అత్యాచారం..

**భార్య ఫిర్యాదుతో అరెస్ట్**




**అహ్మదాబాద్: జూన్ 5 మహాప్రభ**
ఒక వ్యక్తి తన టీనేజ్ కుమార్తెపై వరుసగా మూడు రోజుల పాటు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఆ బాలికకు గర్భనిరోధక మాత్రలు ఇచ్చాడు. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడు. చివరకు భార్యకు తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. గుజరాత్‌లోని నవసారి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఒక వ్యక్తి తన 14 ఏళ్ల కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. మే 9, 10, 11 తేదీలలో వరుసగా మూడు రోజుల పాటు అత్యాచారం చేశాడు. ఆ తర్వాత ఆ బాలికకు గర్భనిరోధక మాత్రలు ఇచ్చాడు. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే చంపుతానని కుమార్తెను బెదిరించాడు.కాగా, భయపడిన ఆ బాలిక తొలుత ఈ విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. చివరకు మే 30న తండ్రి చేసిన దారుణం గురించి తన తల్లికి ఆమె చెప్పింది. దీంతో ఆ వ్యక్తి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కుమార్తెపై అత్యాచారానికి పాల్పడిన తన భర్తకు ఉరిశిక్ష విధించాలని ఆమె డిమాండ్ చేసింది.మరోవైపు ఈ ఫిర్యాదుపై పోలీసులు స్పందించారు. పోక్సోతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. పారిపోయేందుకు ప్రయత్నించిన ఆ వ్యక్తి ఆచూకీని గుర్తించి అరెస్ట్ చేశారు. కోర్టులో ప్రవేశపెట్టిన తర్వాత రిమాండ్ నిమిత్తం అతడ్ని జైలుకు తరలించినట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# బొలివియా మాజీ అధ్యక్షుడిని కిడ్నాప్ చేసేందుకు అమెరికా ప్రయత్నం



**సూక్రె జూన్ 5 మహాప్రభ**
బొలివియా ప్రభుత్వ మద్దతుతో అమెరికా తనను అక్రమంగా కిడ్నాప్ చేసేందుకు కుట్ర పన్నుతుందోని ఆ దేశ మాజీ అధ్యక్షుడు ఎవో మోరల్స్ వ్యాఖ్యానించారు. ఈ కుట్రను ఆయన గురువారం తీవ్రంగా ఖండించారు. ఇప్పటికే తన కిడ్నాప్ తేదీ కూడా ఖరారైనట్లు ఆయన వెల్లడించారు. కేబినెట్ సమావేశాల్లో రక్షణ మంత్రి తన కిడ్నాప్ తేది జూన్ 13న నిర్ణయించినట్లు తెలిసిందని మోరల్స్ అన్నారు. అలాగే మోరల్స్‌ని కిడ్నాప్ చేసి.. విరు విరు విమాన్రాశయం నుండి బ్యూనస్ ఎయిర్స్ లేదా లిమాకు.. ఆతర్వాత వాషింగ్టన్‌కు తరలించే బదిలీ మార్గాలను ఉన్నత స్థాయి, పౌర, సైనిక అధికారులు రూపొందిస్తున్నారని మోరల్స్ ఆరోపించారు. కాగా, సామాజిక సంస్థలు, దేశీయ రైతు సంఘాలు మోరల్స్‌ని కిడ్నాప్‌ని తీవ్రంగా ఖండించాయి. ఈ సంస్థలు కిడ్నాప్‌కు సంబంధించి కోచాబంబా ఉష్ణమండల ప్రాంతంలోని నిఘా కార్యకలాపాల గురించి సాంకేతిక వివరాలను అందించాయి. డెల్టా ఎన్ ప్లాన్ కింద అమలు చేసే ఈ కిడ్నాప్ ప్రణాళికను కల్నల్ ఎడ్సన్ రోజాస్, మేజర్ అయాలా సమన్వయం చేస్తున్నారని, దీనికి యు.ఎస్ ఏజెన్సీల నుండి రాజకీయ మద్దతు లభిస్తోందని ప్రముఖ ప్రతినిధులు తెలిపారు. బొలివియా సహజ వనరుల్ని దోచుకోవడానికి, ఈ దేశంలో అత్యధికంగా లభించే లిథియంను అమెరికాకు అప్పగించడానికే బొలివియా రోడ్రిగో పాజ్ ప్రభుత్వం ఈ చర్యలకు సహకరిస్తుందని కార్మిక రైతు నాయకత్వం తీవ్ర విమర్శలు చేసింది.

# శ్రీలంక జావెలిన్ త్రోయర్ రమేశ్ పథిరగే స్టన్నింగ్ షో



**రోమ్ జూన్ 5 మహాప్రభ**
శ్రీలంక అథ్లెట్, జావెలిన్ త్రోయర్ రుమేశ్ పథిరగే స్టన్నింగ్ రికార్డు క్రియేట్ చేశాడు. రోమ్‌లో జరిగిన వాండా డైమండ్ లీగ్‌లో అగ్రస్థానంలో నిలిచాడు. అతను జావెలిన్‌ను 92.62 మీట్ల దూరం విసిరాడు. అయితే ఆసియా త్రోయర్లలో ఇప్పుడు రమేశ్ రెండో స్థానంలో నిలిచాడు. పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్, భారత త్రోయర్ నీరజ్ చోప్రా మధ్యలో లంక అథ్లెట్ చేరాడు. 2024 ఒలింపిక్ ఫైనల్ తర్వాత పథిరగే తొలిసారి ఉత్తమ ప్రదర్శన ఇచ్చాడు. రెండు సార్లు వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన ఆండర్సన్ పీటర్స్ డైమండ్ లీగ్‌లో జావెలిన్‌ను కేవలం 83.91 మీటర్ల దూరం మాత్రమే విసిరాడు. ఇక ప్రపంచ పోటీల్లో కాంస్య పతకం గెలిచిన కుర్టిస్ థాంప్సన్ ఈసారి జావెలిన్‌ను 83.89 మీటర్ల దూరం విసిరి మూడవ స్థానంలో నిలిచాడు.శ్రీలంక క్రీడాకారుడు తన తొలి ప్రయత్నంలో జావెలిన్‌ను 84.49 మీటర్ల దూరం విసిరాడు. ఇక తన రెండో ప్రయత్నంలో జావెలిన్ ను 90 మీటర్లు దాటించాడు. ఈ క్రమంలో అతను జావెలిన్‌ను 90 మీటర్ల దూరం విసిరిన ఆసియా వ్యక్తిగా రికార్డు క్రియేట్ చేశాడు. గతంలో వాడా డైమండ్ లీగ్‌లో 20 ఏళ్ల క్రితం ఆండ్రియాస్ థార్కిడ్ సన్ నమోదు చేసిన 90.34 మీటర్ల రికార్డును రుమేశ్ దాటేశాడు.అయితే ఆ రికార్డును బ్రేక్ చేస్తూ లంక అథ్లెట్ తన జావెలిన్‌ను 92.62 మీటర్ల దూరం విసిరాడు.తాజా ఫీట్‌తో లంక అథ్లెట్ తన ఖాతాలో కొత్త రికార్డు వేసుకున్నాడు. జావెలిన్‌ను 90 మీటర్ల మార్క్ దాటించిన నాలుగవ ఆసియా క్రీడాకారుడిగా నిలిచాడు. గతంలో చైనీస్ తైపియి అథ్లెట్ చెంగ్ చావో సున్(91.36), నీరజ్ చోప్రా(90.23), ఒలింపిక్ చాంపియన్ అర్షద్ నదీమ్ ఉన్నారు.

# భారత జీడీపీ వృద్ధి రేటు 7.7 శాతం

- అంతర్జాతీయ సవాళ్ల మధ్య భారత్ వృద్ధి జోరు
- చివరి త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి
- తయారీ, సేవల రంగాలే వృద్ధికి ప్రధాన బలం
- వ్యవసాయం, మత్స్య రంగాల నుంచి కూడా కీలక తోడ్పాటు
- రూ.323 లక్షల కోట్లకు చేరిన స్థూల దేశీయోత్పత్తి
- నామమాత్ర జీడీపీ వృద్ధి 8.9 శాతానికి పెరుగుదల
- ప్రపంచ ఆర్థిక అనిశ్చితుల్లోనూ భారత్ సత్తా
- ఆర్థిక బలాన్ని చాటిన తాజా జీడీపీ గణాంకాలు




2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి భారత దేశం 7.7 శాతం జీడీపీ వృద్ధి రేటు సాధించింది. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం వెల్లడించింది. గత ఏడాది వృద్ధి రేటు 7.1 శాతంకాగా, ఈ ఏడాది అంతకుమించి వృద్ధి రేటు సాధించింది.ఒకపక్క అంతర్జాతీయ సంక్షోభం, యుద్ధ వాతావరణం ఉన్నప్పటికీ దేశం భారీగా జీడీపీ వృద్ధిరేటు సాధించిందని కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అందులోనూ గత జనవరి నుంచి మార్చి వరకు త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి నమోదైనట్లు తెలిపింది. ఇది భారత ఆర్థిక వ్యవస్థకు బలాన్నిచ్చేదే. ఈ ఏడాది అరుదైన ఫలితాలు సాధించడంలో తయారీ, సేవలు, వాణిజ్య రంగాలతోపాటు, వ్యవసాయం, మత్స్య రంగాలు కూడా కీలకంగా మారాయి. 2022--23 నాటి స్థిర ధరల అంచనా ప్రకారం ఈ ఏడాది జీడీపీ 323.12 లక్షల కోట్లకు చేరుకుంది.అంతకుముందు సంవత్సరం.. అంటే 2025 ఆర్థిక సంవత్సరంలో ఇది 299.89 లక్షల కోట్లుగా ఉంది. ద్రవ్యోల్బణాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే సాధారణ జీడీపీ రేటు 8.9 శాతానికి పెరిగింది. అంటే దీని విలువ గత ఏడాది 318.07 లక్షల కోట్ల నుంచి ఈ ఏడాది 346.36 లక్షల కోట్లకు చేరింది. జీడీపీ అంటే దేశంలో ఒక ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి అయిన అన్ని వస్తువులు, సేవల మొత్తం విలువ.

# పాలన చేతగాక పోతే రాజీనామా చేయండి

మొదటి తరువాయి

చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో విఫలమై కేంద్రంపై నెపం మోపడం సరికాదని విమర్శించారు. రాష్ట్రంలో ఎంత పంట ఉత్పత్తి అవుతుందో ముందుగానే అంచనా వేసి ప్రణాళికలు రూపొందించకుండా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని అరవింద్ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలన చేతకాకపోతే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.దొంగ ఇసుక, మొరం రవాణా కోసం ట్రాక్టర్లు, లారీలు అందుబాటులో ఉంటే, రైతుల ధాన్యాన్ని తరలించేందుకు మాత్రం కొరత వస్తుందా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐకి లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయిలు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ధాన్యాన్ని ఇళ్ల ముందు కుమ్మరిస్తామనడం రైతులను అవమానించడమేనని అన్నారు. అలాగే ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపైనా విమర్శలు చేసిన ఆయన, ప్రస్తుతం ఉన్న నగర సమస్యలను పరిష్కరించకుండా కొత్త నగరాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. నిరుద్యోగ భృతి, గ్రామీణ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ వంటి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ ప్రయోజనాలకు అనుకూలంగా ముఖ్యమంత్రి ఇప్పటివరకు కేంద్రం ముందు బలమైన వాదన వినిపించలేదని అరవింద్ విమర్శించారు. కాంగ్రెస్ నాయకత్వం, రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై పలు ప్రశ్నలు లేవనెత్తుతూ, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు

# మణిపూర్‌లో మళ్లీ భగ్గుమన్న హింస

మొదటి తరువాయి

ఈ సమాచారం తెలుసుకున్న భద్రతా దళాలు ఆ ప్రాంతానికి చేరుకున్నాయి. గ్రామంపై దాడి చేసిన సాయుధ మిలిటెంట్లను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రభావిత ప్రాంతం, పరిసర ప్రాంతాల్లో అదనపు భద్రతా సిబ్బందిని మోహరించారు. ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో అక్కడి పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

## భారత్‌పై ఒత్తిడి తేవడంలో అమెరికా విఫలం:



**సెయింట్ పీటర్స్‌బర్గ్**

భారతదేశ విదేశాంగ విధానంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసలు కురిపించారు. ఇండియాతో బంధాన్ని మరింత విస్తృతం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. రష్యాతో రిలేషన్ అంశంలో భారత్‌పై అమెరికా వత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించిందని, కానీ ఆ ప్రయత్నాల్లో అమెరికా విఫలమైనట్లు పుతిన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ సంబంధాలను అమెరికా బలహీనపరిచే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మేటి న్యూస్ ఏజెన్సీలతో పుతిన్ మాట్లాడారు. ఈ సందర్భంగా భారత ఆర్థిక వృద్ధిని ఆయన ప్రశంసించారు. భారత వ్యక్తిగత విదేశాంగ విధానాన్ని కూడా ఆయన మెచ్చుకున్నారు.భారత్‌తో ఆర్థిక సంబంధాన్ని కొనసాగించేందుకు దృఢ నిశ్చయంతో ఉన్నట్లు పుతిన్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని, ఆ దేశంలో ప్రస్తుతం ఆర్థిక వృద్ధి ఇంప్రెసివ్‌గా ఉందని పుతిన్ అన్నారు. రాబోయే రోజుల్లో రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు వంద బిలియన్ల డాలర్లకు చేరుకోనున్నట్లు ఆయన విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. భారత్‌పై పశ్చిమ దేశాలు వత్తిడి తేవాలని ప్రయత్నిస్తే అది ఆ దేశాలకు బ్యాక్‌ఫైర్ అవుతుందని పుతిన్ అన్నారు. ఇండియాపై ప్రెజర్ పెట్టాలని అమెరికా ప్రయత్నిస్తోందని, కానీ అత్యధిక జనాభా గల భారత్‌పై కానీ, మోదీపై కానీ వత్తిడి తేస్తే, అది అంతర్జాతీయ సంబంధాలకు, ద్వైపాక్షిక బంధాలకు విఘాతం అవుతుందని పుతిన్ తెలిపారు.

# మీ పదేళ్ల పాలన....నా రెండున్నరేళ్ల పాలనపై చర్చిద్దామా

మొదటి తరువాయి

అడుగుతామన్నారు. మీకు డిపాజిట్లు వస్తే.. నా పేరు మార్చుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. రాసి పెట్టుకో కేసీఆర్.. పాలమూరులో మీ జెండా ఎగరనివ్వమని హెచ్చరించారు. పాలమూరు ప్రాజెక్టుకు డిసెంబర్‌లోగా 90 టీఎంసీలు నీటిని సాధిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. నీటి సమస్యలపై పక్క రాష్ట్రాలతో చర్చలు వద్దా? అని కేసీఆర్ తీరును ఎండగట్టారు. తాను చర్చలు చేస్తానంటే బురద జల్లుతున్నారని మండిపడ్డారు. ఏపీతో చర్చలు జరుపుతామని ఈ సందర్భంగా సీఎం రేవంత్ స్పష్టం చేశారు. తెలంగాణలో ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన ప్రాజెక్టుల పునరుద్ధరణే తన లక్ష్యమని సీఎం రేవంత్ ప్రకటించారు. వలసలు, ఆత్మహత్యల కష్టనష్టాలు మనకు తెలుసునన్నారు. కేసీఆర్ మహబూబ్‌నగర్ ఎంపీగా ఉన్నప్పుడే తెలంగాణ వచ్చిందని గుర్తు చేశారు. కరీంనగర్ నుంచి వలస వచ్చిన కేసీఆర్‌ను గెలిపించారని వివరించారు. ఎంపీగా గెలిచిన కేసీఆర్ కనీసం ప్రజలను కలవడానికి కూడా రాలేదన్నారు. కష్టకాలంలో ఆదుకున్న పాలమూరును కేసీఆర్ పట్టించుకోలేదని చెప్పారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు కేసీఆర్ ఎన్నో హామీలు ఇచ్చారు కానీ కేసీఆర్ చేసిందేమీ లేదన్నారు. పాలమూరు నుంచి పారిపోయిన కేసీఆర్ ద్రోహి అవుతారా? లేక నేనా? అని ప్రశ్నించారు. పాలమూరు జిల్లాలో ఏ ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదంటూ కేసీఆర్‌పై మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు పాదయాత్ర చేస్తామంటున్నారని సీఎం రేవంత్ వ్యంగ్యంగా అన్నారు. కాశీ వరకు పొర్లు దండాలు చేసినా మీ పాపాలను ఎవరూ మరిచిపోరని ఆ పార్టీ నేతలకు స్పష్టం చేశారు. కేసీఆర్ ఎప్పుడైనా రైతుల కష్టాల గురించి ఆరా తీశారా? అని ప్రశ్నించారు. మేక వన్నె పులిలాంటి కేసీఆర్‌ను ప్రజలు ఎప్పటికీ నమ్మరని పేర్కొన్నారు. కేసీఆర్ తర్వాత ఆయన కొడుకు, మనవడు రాజ్యాలు ఏలుతారా? అని నిలదీశారు. నాడు మిడ్జిల్ నుంచి తాను జెడ్పిటిసిగా గెలిచానని గుర్తు చేశారు. 2006లో మీరు నాటిన మొక్కే ఇప్పుడు వృక్షమై మీ ముందుందని ప్రజలను ఉద్దేశించి సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. నాడు మీరు గెలిపించిన ఈ జెడ్పిటిసి ఇప్పుడు రాష్ట్రానికి సీఎం అయ్యారని వివరించారు. కేసీఆర్ కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయ్యిందని ఎద్దేవా చేశారు. మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలంటే మనవాళ్లే ఉండాలన్నారు. ఆత్మగౌరవంతో బతకాలంటే ఇందిరమ్మ ఇల్లు ఉండాలని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు లేదన్నారు. బీఆర్ఎస్ నేతలవి నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలేనని చెప్పారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి మోసం చేశారంటూ బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. దళితులకు 3 ఎకరాలు ఇస్తామని చెప్పి దగా చేశారన్నారు. కేజీ టు పీజీ విద్య హామీ ఎక్కడికి పోయిందని ఆ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇకపై పాలమూరు గడ్డపై బీఆర్ఎస్ గుర్తు మాయమని సీఎం రేవంత్ జోస్యంచెప్పారు. మీ పాలమూరు బిడ్డగా రెండురోజులుగా జిల్లా రైతులకోసం సాగునీరు ప్రాజెక్టులను పరిశీలించానన్నారు. వలసల కష్టాలు, ఆత్మహత్యల నష్టాలు మనకు తెలుసని అన్నారు. పాలమూరులో ఊరు లేకపోయినా, పార్లమెంటులో నోరు లేకపోయినా ఇక్కడికి రాజకీయంగా వలసవచ్చిన కేసీఆర్ ను ఇక్కడి ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారు. కేసీఆర్ మేకవన్నె పులి అని గుర్తించక ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణకు రెండుసార్లు ముఖ్యమంత్రిని చేస్తే.. పదేళ్లలో పాలమూరు జిల్లాలోని ఏ ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదన్నారు. పాలమూరులో గెలిపిస్తే పారిపోయి గజ్వేల్ లో పోటీ చేసిన కెసీఆర్ పాలమూరు ద్రోహినా? నేను పాలమూరు ద్రోహినా అంటూ నిలదీసారు. పాలమూరు జిల్లాలో 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించాలనే సంకల్పంతో పని చేస్తున్నాం.మీ పాలమూరు బిడ్డగా జిల్లాలో ప్రాజెక్టుల కోసం ఈ 30 నెలల్లో 8 వేల కోట్లు ఖర్చు చేశా.జైళ్లు కట్టాలని వాళ్లు అనుకుంటే స్కూళ్లు కట్టాలని మనం అనుకున్నాం.ఏం చదవాలన్నా పాలమూరు జిల్లాకు వచ్చేలా కొడంగల్ లో ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నాం. చదువొక్కటే మీ జీవితాల్లో వెలుగు నింపుతుంది.. పిల్లల్ని చదివించండి? చదువుకుంటేనే బతుకులు బాగుపడతాయి జిల్లాల్లో వలసలు ఆగాలన్నా, రైతులు సంతోషంగా ఉండాలన్నా పాలమూరు జిల్లా ప్రాజెక్టులు పూర్తి కావాలన్నారు. పాలమూరు ప్రజలు మట్టి తీసుడే కాదు? మట్టితో కప్పడం కూడా తెలుసన్నారు. రేవంత్ రెడ్డి ఏం చేసిండని కొందరు అవాకులు చవాకులు పేలుతున్నారు.15 లక్షల రేషన్ కార్డులు అందించాం.4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశాం. 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించాం. పది వేల కోట్లు మహిళలకి ఉచిత బస్సు ప్రయాణానికిఖర్చు చేశాం ఇలా మేం చేసింది చెప్పాలంటే రాస్తే రామాయణం.. చెబితే భారతం . మీ పదేళ్ల పాలనపై, మా రెండున్నరేళ్ల పాలనపై చర్చిద్దాం.. కెసీఆర్ అసెంబ్లీకి రా అంటూ సవాల్ చేశారు. పాలమూరు జిల్లా ప్రాజెక్టులకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు మంజూరు చేసే బాధ్యత నాదని అన్నారు. 2034 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీదే అధికారం అని, 2029 లో కాంగ్రెస్ ను మళ్లీ

# ఆసక్తికరంగా తమిళనాడు రాజకీయాలు

- కొత్త పార్టీ పెటట్టబోతున్న అన్నామలై
- ప్రజలు లక్ష్యంగా రాజకీయ పార్టీని నడిపిస్తా
- బిజెపికి భారం కాకూడదనే బయటకు వచ్చా
- ఒంటరిగా పోటీచేయాలన్న తనవాదనను పట్టించుకోని బిజెపి
- గతంలో రజనీకాంత్ సార్ తనతో కలవమని కోరారు
- మీడియా సమావేశంలో మాజీ బిజెపి నేత అన్నామలై




చెన్నై,

తమిళనాడు రాజకీయాల్లో కొంతకాలంగా ఆసక్తి పరిణామాలు చోటుచేసుకుం టున్నాయి. ఇంతకాలం సీఎం విజయ్‌పై ఉన్న దృష్టి.. ఇప్పుడు అన్నామలై వైపు మళ్లింది. ఆయన ఇప్పటికే భాజపాను వీడగా.. తన రాజకీయ భవిష్యత్తు గురించి తాజాగా మీడియాతో మాట్లాడారు.

బిజెపికి రాజీనామా చేసిన మాజీ ఐపీఎస్ అధికారి అన్నామలై కొత్త పార్టీ పెట్టబోతున్నట్లు ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. కొత్త రాజకీయ ఉద్యమం చేయబోతున్నట్లు అన్నామలై

తెలిపారు. భారతీయుడిగా, తమిళుడిగా గర్విస్తున్నానని, తన ఆలోచనలకు అనుగుణంగా ముందుకెళ్తానని స్పష్టం చేశారు. తమిళనాడు అభివృద్ధే తన ప్రథమ ప్రాధాన్యమన్నారు. అన్నామలై శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. మార్పు కోసమే బీజేపీలో చేరానన్నారు. రాజీనామా ఆమోదించిన బీజేపీ హైకమాండ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీ అంటే తనకు ఎంతో గౌరవం ఉందని అన్నారు. 'తమిళనాడులో బీజేపీ ఒంటిరిగా పోటీ చేయాలని ఆశించా. 18 నెలలుగా బీజేపీతో విభేదాలు ఉన్నాయి. బీజేపీకి నేను భారంగా ఉండాలనుకోవడం లేదు. అందుకే బీజేపీకి రాజీనామా చేశా. 2025 డిసెంబర్ నెలలోనే అధిష్ఠానానికి రాజీనామా గురించి చెప్పా. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యే వరకు పార్టీలో ఉన్నా'అని అన్నారు. 'ఈ సమయంలో తమిళనాడుకు కొత్త పార్టీ అవసరమా అని అడిగితే.. కచ్చితంగా అవసరమే అని అన్నామలై అన్నారు. ఓ షాపునకు వెళ్లి టూత్‌పేస్టో.. బియ్యమో.. కందిపప్పో కొంటున్నపుడు పది షాపులు తిరుగుతాము. రేటు, నాణ్యత చెక్ చేసి కొంటాం. ఎందుకంటే అవి మన శరీరంలోకి పోయేవి. ఇప్పుడు ఎన్ని పార్టీలు ఉన్నా కూడా పార్టీ నాయకుడు ఎలాంటి వాడో ప్రజలు చూస్తారు. పక్కంటి వాళ్లను చూసినట్లే ప్రజలు మమ్మల్ని చూడబోతున్నారు. దూరం నుంచి ప్రజలకు అభివాదం చేసే రాజకీయాలకు మేము దూరం. కల్ట్ పాలిటిక్స్ నుంచి బయటకు రావాలి. రాజకీయాలను మారుస్తాం అంటున్నారు.. మళ్లీ అదే కల్ట్ పాలిటిక్స్ చేస్తున్నారు. కామన్ మ్యాన్ పాలిటిక్స్ ముందుకు తీసుకురావాలనుకుంటున్నా. కేవలం ముఖ్యమంత్రి కారణంగా మార్పు సాధ్యం కాదు. సర్పంచ్ దగ్గరి నుంచి ముఖ్యమంత్రి వరకు అందరూ నిబద్ధత కలిగిన వాళ్లు ఉంటేనే మార్పు సాధ్యం అవుతుందని అన్నామలై అన్నారు. ఈసందర్భంగా ప్రముఖ నటుడు రజనీకాంత్ ప్రస్తావన తెచ్చారు. తనతో చేతులు కలపమని గతంలో సూపర్‌స్టార్ అడిగారన్నారు. 2024లో తాను భాజపాలో చేరడానికి ఒకరోజు ముందు రజనీకాంత్ నాకు ఫోన్ చేశారు. ఆయన నేతృత్వం వహిస్తున్న రాజకీయ ఉద్యమంలోకి రావాలని ఆహ్వానించారు. కానీ, నేను అప్పటికే భాజపా సీనియర్ నేత బీఎల్ సంతోష్‌కు మాటిచ్చా. అందుకే రజనీ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించా. నేను రాజకీయాల్లోకి రావడానికి కారణం బీఎల్ సంతోష్ ఇచ్చిన హామీనే. నా రాజకీయ ప్రవేశంపై ఉన్న ఊహాగానాలకు ముగింపు పలికేందుకు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాను. అయితే తమిళనాడు విషయంలో నా అభిప్రాయాలు.. భాజపా నాయకత్వం అభిప్రాయాలతో సరిపోలలేదు. ఈ విభేదాలను పరిష్కరించు కునేందుకు పార్టీ అగ్రనాయకత్వంతో 18 నెలలుగా ఎన్నో చర్చలు జరిపాను. ఇంక భాజపాకు భారంగా ఉండకూడదని అనుకున్నాను‘ అని అన్నామలై వివరించారు. ఇకపై స్వతంత్ర రాజకీయ మార్గంలో ముందుకువెళ్తానని, తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త బాటలు వేసేందుకు పోరాడతానని తెలిపారు.

గత ఏడాది డిసెంబర్‌లోనే నా రాజీనామా గురించి చెప్పాను. అయితే పార్టీ పెద్దలు నన్ను ఆపారు. ఎన్నికల బాధ్యతలు నిర్వహించమని సూచించారు. ఇప్పుడు నా రాజకీయాలు సామాన్యుడి లక్ష్యంగా ఉంటాయి. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సొంతంగా పోటీ చేస్తాను. అప్పటివరకు అందరినీ ఏకతాటిపైకి తీసుకుని వచ్చేందుకు ప్రయత్నిస్తాను. అలాగే అన్నామలై మక్కల్ ఇయక్కమ్ పేరిట రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించారు. దానికి భారీ స్పందన వస్తోందని చెప్పారు. ఇదిలావుంటే అన్నామలై వెళ్లిపోవడం వల్ల పార్టీకి ఎలాంటి నష్టం లేదని భాజపా తమిళనాడు చీఫ్ నైనార్ నాగేంద్రన్ వెల్లడించారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే చర్యలు కొనసాగుతాయని వెల్లడించారు.

# 'దేశంలో కొంతమంది నిరాశావాదులున్నారు..



న్యూఢిల్లీ,

దేశంలో కొందరు నిరాశావాదులు ఉన్నారనీ, 'ఆత్మనిర్భర్ భారత్' ప్రచారాన్ని, దేశ దృఢ సంకల్పాన్ని విమర్శించడమే వీళు పనిగా పెట్టుకున్నారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపైన, కాంగ్రెస్ పార్టీపైనా ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలు గుప్పించారు. ఇతర దేశాలపై ఆధారపడం వల్ల ఏ దేశం తాను నిజంగా సాధించాల్సిన అభివృద్ధిని అందుకోలేదన్న విషయాన్ని వీరు విస్మరిస్తున్నారని విమర్శించారు. గుజరాత్‌లోని సూరత్‌లో శుక్రవారంనాడు జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోడీ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అలజడులు, అస్థిరతను వ్యాప్తి చేయడం ద్వారా అవకాశాలు పొందాలని కోరుకుంటోందని, అయితే దేశ ప్రజలకు వీరి పన్నాగాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ వస్తున్నారని ప్రధాని అన్నారు. 'గుజరాత్ ప్రజలు కాంగ్రెస్ పార్టీని అడ్రెస్ లేకుండా చేసారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న చోట్ల కూడా వారి అవకతవకల పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. ఇటీవల హిమాచల్ ప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే ఇందుకు ఉదాహరణ. అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నప్పటికీ ఆ పార్టీ దారుణమైన ఓటమి చవిచూసింది. కాంగ్రెస్ అవకతవకల పాలనను హిమాచల్ ప్రజలు తిప్పికొట్టారు. దీనికి ముందు హర్యానాలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. పంజాబ్ ప్రజలు కూడా ఆ పార్టీకి స్పష్టమైన సందేశం ఇచ్చారు. అల్లకల్లోలంలో అవకాశాలు వెతుక్కోవడం అనే కాంగ్రెస్ రాజకీయం ఎప్పటికీ పనిచేయదు' అని మోదీ అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, అందుకే ముఖ్యమంత్రిని కూడా మార్చాల్సి వచ్చిందని ఇటీవల అక్కడ జరిగిన పరిణామలపై మోదీ వ్యాఖ్యానించారు. దేశ ప్రజలు తమ కలలు, ఆకాంక్షలను కార్యరూపంలోకి రావాలనే పట్టుదలతో ఉన్నారని, దేశ ప్రజల సమష్టి సంకల్పంతో ఏదైనా సాధించవచ్చని అన్నారు. ఇటీవల కాలంలో అనేక సంక్షోభాలను ప్రపంచం ఎదుర్కొందని, తొలుత కోవిడ్ సంక్షోభం, ఆ తర్వాత ఇంధన సంక్షోభం కుదిపేసిందని అన్నారు. పెట్రోల్ ధరల్లో నిలకడ లేకపోవడం, సప్లయ్ చైన్స్ కుప్పకూలడం వంటివి చోటచేసుకున్నాయని, అయితే ప్రతి సంక్షోభాన్ని 140 కోట్ల మంది ప్రజలు సమష్టిగా ఎదుర్కోవడం తనకెంతో తృప్తినిచ్చిందని అన్నారు. గుజరాత్ పర్యటనలో భాగంగా సూరత్‌లో రూ.18,800 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు.

# తట్టెడు మట్టి తీయలేదు

మొదటి తరువాయి

ప్రకటన విడుదల చేశారు.

**ఇరిగేషన్‌పై జంతెద్దు ఫైర్ అవుతాయి**


బీఆర్ ఎస్ హయాంలో, కాంగ్రెస్ హయాంలో జరిగిన కృష్ణా జలాల వినియోగంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేసిన అవగాహన లేని మాటలాడుతున్నాడని హరీశ్ రావు ఏ విధంగా ఎద్దేవా చేశారు. "కృష్ణా నీటి వినియోగం పై అవగాహన లేని వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం తెలంగాణ జల హక్కులకు తీవ్ర విఘాతం. నీళ్ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి కూడా కనీస అవగాహన లేదా? మీ ఇద్దరికి మీ ప్రభుత్వం రాసిన అధికారిక లేఖల్లో ఏం ఉందో తెలియదా? 30 వేలని దాటింది ఇప్పుడొక ఇరిగేషన్ మీద ఫైరెందుకు? గత మే నెల 2 న తెలంగాణ ఈఎన్సీ జనరల్... కృష్ణా బోర్డుకు రాసిన లేఖ ప్రకారం, ఆంధ్రప్రదేశ్ 74.23తాతల నీటి వాటా, తెలంగాణ కేవలం 25.77లక్షల వినియోగం చేసుకుందని చెప్పింది నిజం కాదా" అని ప్రశ్నించారు. బీఆర్ ఎన్ పాలనలో 35 లక్షల వరకు కృష్ణా నీళ్లను వినియోగించుకున్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ఉదాహరణ సహితంగా గుర్తు చేశారు.

**మీరు కేసులు వేసినా.. భూసేకరణ చేశాం**

12.30 లక్షల ఎకరాలకు సాగునీరు, 1,226 గ్రామాలకు తాగునీరు అందించే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి వ్యతిరేకంగా కేసులు వేయించి, ఆనాడు ప్రాజెక్టు పనుల పురోగతిని అడ్డుకున్న వ్యక్తి రేవంత్ రెడ్డినని హరీశ్ రావు ఈ సందర్భంగా మండిపడ్డారు. "పాలమూరు ప్రాజెక్టుకు మీరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎంత మంది రైతులను రెచ్చగొట్టినా నాడు బి ఆర్ ఎస్ ప్రభుత్వం 27,191 ఎకరాల భూసేకరణ చేసింది నిజం. పాలమూరు ప్రాజెక్టు గాను మీరు రెండున్నరేళ్ల పాలనలో ఎన్ని ఎకరాల భూమి సేకరించాలో చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం. రెండున్నరేళ్ల సమయం వృధా చేసి, సగం పాలనా కాలం పూర్తయిన తర్వాత ఇప్పుడు కుంభకర్ణ నిద్ర లేచి, భూసేకరణకు ప్రతిపాదనలు అనడం సిగ్గుచేటు" అని ముఖ్యమట్టారు.

# బిఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం

మొదటి తరువాయి



పాలన సాగిస్తోందని వ్యాఖ్యానించారు. రైతు రుణమాఫీ హామీ పూర్తిగా అమలు కాలేదని తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి 'డబుల్ ఇంజిన్ సర్కార్' అవసరమని వెల్లడించారు. 2014 తర్వాత దేశంలో సంక్షేమం, అభివృద్ధి సమన్వయంతో ముందుకు సాగుతోందని రాంచందర్‌రావు అన్నారు. బీజేపీ కార్యకర్తలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతికతతో పాటు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కొనసాగించాలన్నారు. శిక్షణా తరగతుల్లో చర్చించిన 12 అంశాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీజేపీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయాలని నేతలకు రాంచందర్‌రావు సూచించారు.

## సంపాదకీయం

# స్వయంకృతాపరాధం



పశ్చిమ బెంగాల్ రాజకీయాలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. అధికార అహంకారంలో ప్రజలకు దూరమైతే, మతతత్వ శక్తులతో అవకాశవాద రాజకీయాలు చేస్తే చివరకు దాని ఫలితం ఎలా ఉంటుందో బెంగాల్ ప్రత్యక్ష? ఉదాహరణ. బీజేపీ అధికారంలోకి రావడం ఒక్కరోజులో జరిగిన పరిణామం కాదు. దానికి ఆ పార్టీ ఎత్తులు ఎంత కారణమో, మమతా బెనర్జీ స్వయంకృతాపరాధాలు కూడా అంతే కారణం? వాస్తవానికి బీజేపీ బెంగాల్‌లో పాదం మోపడానికి రాజకీయంగా అవకాశమిచ్చింది కూడా మమతేనన్న సంగతి మనం మరువకూడదు. ఇటీవల ఎన్నికల్లో ఓటమి తర్వాత తృణమూల్‌లో అసంతృప్తి చెలరేగింది. ఒకప్పుడు మమతకు అత్యంత సన్నిహితులుగా ఉన్న నాయకులు వేర్వేరు గ్రూపులుగా విడిపోతున్నారు. కొందరు పార్టీని వీడుతున్నారు. మరికొందరు బీజేపీ వైపు చూస్తున్నారు. దీన్ని అవకాశంగా తీసు కున్న బీజేపీ తృణమూల్‌ను దెబ్బతీసే పనిలో పడింది. ఆ పార్టీ నేతలను తమ 'వాషింగ్ మిషన్'లో శుద్ధి చేస్తోంది. పార్టీ అంతర్గత కమిటీల రద్దు, నాయ కత్వ సంక్షోభం, శాసనసభలో ప్రతిపక్ష నాయకత్వంపై వివాదాలు తృణమూల్‌లో ఏర్పడిన గందరగోళానికి సంకేతాలు. తాజా పరిణామాలకు ముందుకు మూడు దశాబ్దాలు వెనక్కివెళ్తే తృణ మూల్ అవకాశవాద రాజకీయం అర్థమవుతుంది. 1990 చివరలో కాంగ్రెస్ నుంచి బయటకొచ్చిన మమతా బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్‌ను స్థాపించింది. వామపక్ష? ప్రభుత్వాన్ని గద్దెదించే లక్ష్యంతో బీజేపీతో చేతులు కలిపింది. వాజ్‌పేయ్ నేతృత్వంలోని ఏన్డీయేలో చేరి రైల్వే మంత్రిగానూ పనిచేసింది. వామపక్ష?లను బలహీనపరచాలని చివరకు మావోయిస్టులతో చేతులు కలిపేందుకు కూడా వెనుకాడలేదు. 2011లో అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా మమత అదే రాజకీయాన్ని కొనసాగించింది. వామపక్షాలు, ప్రజాస్వామ్య శక్తులు తిరిగి బలపడకుండా అన్ని స్థాయిల్లో అడ్డుకునే ప్రయత్నం చేసింది. స్థానిక సంస్థల నుంచి అసెంబ్లీ వరకు ప్రతిపక్ష స్థలాన్ని కుదించింది. ఫలితంగా వామపక్షాలు కాస్త బలహీనపడినా, కాంగ్రెస్ పూర్తిగా క్షీణించింది. ఆ ఖాళీని బీజేపీ ఆక్రమించింది. 2021 ఎన్నికల తర్వాత స్వయంగా మమత "వామపక్షాలు ప్రతి పక్ష?ంలో ఉంటే బాగుండేది, ప్రజా సమస్యలు చర్చకైనా వచ్చేవి" అంటూ వ్యాఖ్యానిం చడం యాదృచ్ఛికం కాదు. వామపక్షాలను పూర్తిగా రాజకీయంగా తుడిచి పెట్టాలనుకుని అసలుకే ఎసరు తెచ్చుకుంది. తన రాజకీయానికి వచ్చిన దుష్పరిణామాన్ని ఆమె గుర్తించినా అప్పటికే ఆలస్యమైంది. అంతవరకు బెంగాల్‌లో చిన్న శక్తిగానే ఉండేది. ప్రధాన రాజకీయ పోటీ వామపక్ష? ఫ్రంట్, కాంగ్రెస్ మధ్య సాగేది. కానీ తృణమూల్–బీజేపీ పొత్తుల వల్ల బీజేపీ గ్రామాలకు పాకింది. ఇతర పార్టీల వ్యతిరేక ఓట్లను సమీకరించే ప్రక్రియలో తన సొంత రాజకీయ స్థావరాన్ని నిర్మించుకుంది. ఆ విత్తనమే నేడు విషవృక్ష?ంగా మారింది. పదిహేనళ్ల పాటు అధికారంలో ఉన్న మమతా వామపక్ష?లను బలహీన పరచాలనే చూశారు తప్ప ప్రజా సమస్యల్ని పట్టించుకోలేదు. నిరుద్యోగం, పరిశ్రమల కొరత, వ్యవసాయ సంక్షోభం, ధరల పెరుగుదల, కార్మికుల సమస్యలు పరిష్కారం నేటికీ అలాగే ఉన్నాయి. వామపక్ష? ప్రభుత్వం అధికారంలో ఉండగా ప్రజా సమస్యలు, రైతుల కష్టాలు, కార్మికుల బాధలు, కేంద్రం అనుసరిస్తున్న విధానాల ప్రభావం వంటివి విస్తృతంగా చర్చకు వచ్చేవి. తృణమూల్ బలపడినప్పుడు కూడా వామపక్ష?లు ప్రధాన ప్రతిపక్ష?ంగా నిలిచి ప్రభుత్వ విధానాలను ప్రశ్నించేవి. ఇప్పుడు అధికార–ప్రతిపక్షాల మధ్య జరుగుతున్న రాజకీయ రగడలో ఇవి చర్చకు రావడం లేదు. పైగా తాజాగా బెంగాల్ ముఖ్య మంత్రి సువేందు అధికారి 'మా ప్రభుత్వం హిందువుల కోసం మాత్రమే పని చేస్తుంది, ముస్లింల కోసం కాదు" అని ప్రకటించడం వారి నిజస్వరూపాన్ని బహిర్గతం చేసింది. పైగా ముస్లింలు బంగ్లాదేశ్‌కు వెళ్లిపోవాల్సిందేనంటూ బీజేపీ నేతలు హెచ్చరికలు చేస్తున్నారు. ఇక్కడ ముఖ్యమైన విషయం గుర్తుపెట్టుకోవాలి. తృణమూల్ వామపక్ష?లను బలహీన పరచడం చివరకు బీజేపీకే లాభం చేకూర్చింది.ప్రజా ఉద్యమాల నుంచి వచ్చిన శక్తులను అణచివేసి, రాజకీయ పోటీని రెండు పార్టీల మధ్య పరిమితం చేస్తే, చివరకు మతతత్వ శక్తులు ఎలా బలపడతాయో బెంగాల్ అనుభవం చూపిస్తోంది. ఇదంతా చూస్తుంటే మహాభారతంలోని ధృతరాష్ట్ర కౌగిలి గుర్తుకు వస్తుంది. ప్రేమగా కౌగిలించుకున్నట్టు కనిపించినా అంతిమంగా అది వినాశనానికి దారితీస్తుంది. అన్నట్టుగానే వామపక్షాలను ఓడించేందుకు బీజేపీతో కలిసి నడిచిన రాజకీయాలు చివరకు మమతనే మింగేశాయి. నేడు బీజేపీ అదే సంబంధాలను, అదే నాయకుదే రాజకీయ స్థలాన్ని ఉపయోగించుకుని తృణమూల్‌ను నిలువునా కూల్చే ప్రయత్నం చేస్తోంది. ఇది మమతా స్వయంకృతాపరాధమే!

# రైతుల సమస్యలపై స్పందించిన ఎస్పీ.

**-ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి సమస్యలపై ఆరా.**

**-లారీలు, టార్పాలిన్ల ఏర్పాటుకు అధికారులకు ఆదేశాలు**

**-మెదక్ జిల్లా ఎస్పీ డి. వి శ్రీనివాస రావు ఐపీఎస్.**

**మెదక్ జిల్లా -05జూన్ (మహాప్రభ ).**
రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కరించేందుకు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ శుక్రవారం మెదక్ లోని దాయర పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసన్నకుమార్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ సందీప్‌రెడ్డి, ఎస్ఐ నారాయణతో కలిసి కేంద్రంలోని పరిస్థితులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించేందుకు సరిపడా లారీలు అందుబాటులో లేక కొనుగోలు ప్రక్రియ ఆలస్యమవుతోందని రైతులు ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే వర్షాల కారణంగా ధాన్యం



తడిసిపోకుండా ఉండేందుకు బ్లాక్ టార్పాలిన్లు అవసరమని కోరారు. దీనిపై వెంటనే స్పందించిన ఎస్పీ, జిల్లా అదనపు కలెక్టర్ నగేష్‌తో ఫోన్‌లో మాట్లాడి రైతులకు అవసరమైన టార్పాలిన్లు, ఇతర సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనికి స్పందించిన అదనపు కలెక్టర్ తక్షణమే అవసరమైన ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ధాన్యం రవాణాకు అవసరమైన లారీల కొరతపై కూడా ఎస్పీ స్పందించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని రైతులకు లారీలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని డీఎస్పీ ప్రసన్నకుమార్‌ను ఆదేశించారు. రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతుల సంక్షేమానికి జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ సహకారం అందిస్తారని, రైతుల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగంతో కలిసి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు.

# తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి.

**మాజీ డిప్యూటీ స్పీకర్ ఏం పద్మాదేవేందర్ రెడ్డి**

**రామయంపేట జూన్ 5 మహాప్రభ**
భారీ వర్షాలకు. తడాసి మొలకెత్తిన ధాన్యాన్ని వెంటనే రాష్ట్రప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం రాయలపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు అనంతరం మండల నాయకులు రైతులతో కలిసి మెదక్ జిల్లా సిద్దిపేట హైవే పైన రోడ్డుపై మొలకెత్తిన ధాన్యం పోసి ధర్నా



రస్తారోకో నిర్వహించారు కొనుగోలు కేంద్రాల్లో సుమారు 20 నుండి 30 లారీల వరకు నిల్వ ఉన్నప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం కొనుగోలు చేయలేదని రైతులు తమకు వివరించారు
మరో రెండు రోజుల్లో మృగశిర కార్తి ప్రారంభం కానున్న నేపథ్యంలో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉందని దీంతో దాన్ని పూర్తిగా ధాన్యం పాడయే ప్రమాదం ఉందన్నారు వెంటనే అధికారులు స్పందించి రాయలపూర్లో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని అవసరమైన లారీలను పంపి ధాన్యాన్ని తరలించాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు
ఈ కార్యక్రమంలో రైతులు నాయకులు పెద్ద ఎత్తున ధర్నాకు తరలివచ్చారు

# మహిళా, బాలల సంక్షేమానికి సమిష్టి కృషి అవసరం.





**-భరోసా సేవల్లో శాఖల మధ్య సమన్వయం పెంచాలి.**

**-బాధితులకు సత్వర న్యాయం, సేవలందించడమే లక్ష్యం: ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్.**

**మెదక్ జిల్లా -05జూన్ (మహాప్రభ ).**
మహిళలు, చిన్నారులపై జరిగే హింస, వేధింపుల కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందించడంతో పాటు రక్షణ, వైద్య సహాయం, కౌన్సెలింగ్, పునరావాస సేవలు సమర్థవంతంగా అందించేందుకు సంబంధిత అన్ని శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం భరోసా కార్యక్రమానికి సంబంధించిన కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహిళలు, చిన్నారుల సంక్షేమానికి సంబంధించిన వివిధ శాఖల అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై నమోదవుతున్న కేసుల్లో వేగవంతమైన దర్యాప్తు జరగడంతో పాటు బాధితులకు అవసరమైన అన్ని సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య, న్యాయ, కౌన్సెలింగ్, పునరావాస సేవల కల్పనలో పోలీసు శాఖతో పాటు ఇతర శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. బాధితులకు సేవలు అందించే ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.భరోసా కేంద్రాల ద్వారా బాధితులకు ఒకే వేదికపై అన్ని రకాల సహాయ సేవలు అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కేంద్రాల పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సహకరించాలని కోరారు. కేసుల పరిష్కారంలో ప్రతి శాఖ తన బాధ్యతలను సమయానుకూలంగా నిర్వర్తించడంతో పాటు రిఫరల్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. బాధితులు అవసరమైన సేవల కోసం వివిధ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒకే చోట అన్ని సౌకర్యాలు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు.సమావేశంలో అడిషనల్ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్, డియస్పి ప్రసన్న కుమార్, భరోసా కోఆర్డినేటర్ సౌమ్య, చైల్డ్‌లైన్ ప్రతినిధులు, సీడబ్ల్యూసీ, జేజేబీ సభ్యులు, డీఎల్ఎస్ఏ ప్రతినిధులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, మహిళా--శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఎస్ఈఆర్పీ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దర్యాప్తు అధికారులు, షీటీం సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యం శిబిరం అభినందనీయం.

**దేవరకొండ పరిధిలోని భీమనపల్లి గ్రామపంచాయతీ లో పేద ప్రజల ఆరోగ్యం కోసం**

**నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలు సమాజ అభివృద్ధికి ఎంతో దోహదపడతాయి**

**-ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**-ఉచిత మెగా కంటి వైద్య శిబిరం సందర్శించిన దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**

**దేవరకొండ డివిజన్ జూన్ 2 ( మహా ప్రభ )**
గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యం క్యాంపు అభినందనీయం అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.శుక్రవారం దేవరకొండ మండలం కొండభీమనపల్లి గ్రామంలో మునుకుంట్ల వెంకట్ రెడ్డి సౌజన్యంతో నిర్వహిస్తున్న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఆయన సందర్శించి కళ్లజోళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. సమాజ సేవా దృక్పథంతో ఈ క్యాంపును ఏర్పాటు చేసిన శ్రీ మునుకుంట్ల వెంకట్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల ఆరోగ్యం కోసం నిర్వహిస్తున్న




ఉచిత వైద్య శిబిరాలు సమాజ అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కంటి వ్యాధుల నివారణకు, ముందస్తు గుర్తింపుకు ఇటువంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు.అనంతరం క్యాంపు నిర్వాహకులు ముఖ్య ఆయన ను శాలువాలతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునికుంట్ల వెంకట్ రెడ్డి,స్థానిక ఉప సర్పంచ్ కడారి సైదులు, బొడ్డుపల్లి కృష్ణ, వడత్య బాలు, అప్పనాల తిరుమల, గుండాల వెంకట్,మల్లేష్,పాల్గొన్నారు.

# రెండేళ్ల పాలన అంతా మాయేనా??

**కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం**

**కిలివేటి సంజీవయ్య మాజీ ఎమ్మెల్యే**




**జూన్ 05 తిరుపతి జిల్లా (సూళ్లూరుపేట) మహాప్రభ** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సూళ్లూరుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమంలో భాగంగా తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా పాతబస్టాండ్ వద్ద వాహనాల రాకపోకలు నిలిపివేసి రాస్తారోకో చేపట్టారు. పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో వారితో సంజీవయ్య మాట్లాడి శాంతి యుతంగా నిరసన కార్యక్రమం చేపడుతున్నామని సర్దిచెప్పారు. అనంతరం టీడీపీ మ్యానిఫేస్టు, బాబు, పవన్ కళ్యాణ్ సంతకాలు పెట్టి ప్రజలకు ఇచ్చిన బాండ్లు, పత్రిక ప్రకటనల కాఫీలను సంజీవయ్యతో పాటు మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కటకం దీపిక నాయకులతో కలిసి దగ్నం చేశారు. సందర్భంగా సంజీవయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు అవుతున్నా ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగ యువతను నట్టేట ముంచి వెన్నుపోటు పొడిచారన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మోసం చేశారన్నారు. సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం కారణంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల నుండే ప్రజలు అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. ప్రజా సమస్యలపై , కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వైఎస్ఆర్సిపి నిరంతర పోరాటం చేస్తుంది అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డివిజన్ కాంగ్రెస్ లో వర్గ పోరు

**-సీనియర్ కాంగ్రెస్ నాయకులకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలి**

**-టీపిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్ కు కాంగ్రెస్ నేతల మొర**



**తూప్రాన్, జూన్ 5 (మహాప్రభ)**
తూప్రాన్ డివిజన్ కాంగ్రెస్ పార్టీలో వర్గ పోరు అంతర్గత అసంతృప్తి మరోసారి రుజువైంది. గతంలో జరిగిన మార్కెట్ కమిటీలు, పార్టీ పదవుల నియామకాలపై తీవ్ర అసంతృప్తితో తూప్రాన్ డివిజన్, మండల కాంగ్రెస్, అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీ లు, సీనియర్ నాయకులు నేరుగా పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను, రాష్ట్ర మంత్రి వివేక్ ను ప్రత్యేకంగా కలిసి తమకు జరుగుతున్న అన్యాయం పై వివరించారు. అహర్నిశలు పార్టీ కోసం దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్యకర్తలను పక్కనపెట్టి, కొందరి సూచనల మేరకే మార్కెట్ కమిటీలు, ఇతర నామినేటెడ్ పదవులు ఇచ్చారని సీనియర్ నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా పార్టీ జెండా క్రింద పనిచేయడం జరిగిందని ఎన్నికల సమయంలో మాత్రమే పార్టీలోకి వచ్చిన వారికి పదవులు కట్టబెట్టడం కష్టపడే కాంగ్రెస్ నాయకులలో కార్యకర్తల్లో అసంతృప్తి నెలకొన్నదని పీసీసీ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా స్పందించిన మహేష్ కుమార్ గౌడ్, ఇక పై ఈ విధమైన పరిస్థితులు రాకుండా చూసుకుంటానని స్పష్టంగా తెలిపారు. గత కొంతకాలంగా ద్విముఖ "వర్గపోరు"మొదలైందని సీనియర్లను కాదని పరోక్ష నిర్ణయాల"పై నాయకులు బహాటంగా అసంతృప్తి వ్యక్తం చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ కోసం కష్టపడిన పార్టీ కార్యకర్తలను విస్మరిస్తున్నారనే విమర్శలు క్షేత్రస్థాయిలో పెరుగుతున్న సమయంలో ఈ భేటీ జరగడం గమనార్హం. దీనిపై స్పందించిన ప్రీతం, త్వరలోనే గజ్వేల్ నియోజకవర్గ స్థాయి విస్తృత కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి, అన్ని మండలాల నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను సేకరిస్తామని తెలిపారు. ఇకపై పదవుల కేటాయింపులో పారదర్శకత పాటిస్తూ, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసు కుంటామని హామీ ఇచ్చారు. గజ్వేల్ కాంగ్రెస్‌లో పెరుగుతున్న అసంతృప్తిని అధిష్టానం ఎలా చక్కదిద్దుతుందనే అంశం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చించుకునే విషయం గా తయారైంది. అయితే ఇప్పటికే జరిగిన నియామకాలపై అసంతృప్తి వ్యక్తం చేసిన నాయకులు, భవిష్యత్తు లోనైనా పార్టీ కోసం కష్టపడిన వారికి న్యాయం జరగాలని కాంగ్రెస్ సీనియర్లు డిమాండ్ చేస్తున్నారు.

# తూప్రాన్ లో కోర్టు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

**-పాత ఎంపీడీవో కార్యాలయ భవనం కోర్టుకు అప్పగింత**

**-జులై 31లోపు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు జిల్లా న్యాయమూర్తి ఆదేశం**

**-ఆగస్టులో కోర్టు ప్రారంభానికి సన్నాహాలు**

**-మౌలిక వసతుల కల్పనకు రూ.30 లక్షలు మంజూరు**

**-ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన జిల్లా న్యాయమూర్తి**






**తూప్రాన్, జూన్ 5.( మహాప్రభ)**
తూప్రాన్ ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కోర్టు ఏర్పాటు కల సాకారం కానుంది. తూప్రాన్ పట్టణంలో కోర్టు స్థాపనకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రతిపాదిత కోర్టు భవనంగా గుర్తించిన పాత ఎంపీడీవో కార్యాలయ భవనాన్ని జిల్లా న్యాయమూర్తి శ్రీమతి నీలిమ, అదనపు జిల్లా న్యాయమూర్తి సంతోష్ కుమార్ శుక్రవారం ప్రత్యక్షంగా పరిశీలించి కోర్టు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ సందర్భంగా పాత ఎంపీడీవో కార్యాలయ భవనాన్ని కోర్టు అవసరాల కోసం అధికారికంగా అప్పగించారు. భవనాన్ని పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి, కోర్టు కార్యకలాపాలకు అవసరమైన అన్ని వసతులు కల్పించేలా మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా జులై 31వ తేదీలోపు అన్ని మరమ్మతులు, అభివృద్ధి పనులు పూర్తి చేసి భవనాన్ని సిద్ధం చేయాలని కాంట్రాక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**రూ.30 లక్షలతో ఆధునిక సౌకర్యాలు**

తూప్రాన్ కోర్టు ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, భవన మరమ్మతులు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, ఫర్నిచర్, కోర్టు హాళ్లు, న్యాయమూర్తుల గదులు, న్యాయవాదుల కోసం ప్రత్యేక సౌకర్యాలు, రికార్డు గదులు, ప్రజల కోసం నిరీక్షణ మందిరాలు తదితర సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఇప్పటికే రూ.30 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో భవనాన్ని పూర్తిస్థాయిలో ఆధునికీకరించి కోర్టు నిర్వహణకు అనువుగా తీర్చిదిద్దనున్నారు.

ఆగస్టులో కోర్టు ప్రారంభం

పనులు నిర్ణీత గడువులోగా పూర్తైతే ఆగస్టు నెలలోనే తూప్రాన్ కోర్టు కార్యకలాపాలు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నట్లు న్యాయశాఖ వర్గాలు తెలిపాయి. కోర్టు ప్రారంభం కావడం ద్వారా తూప్రాన్‌తో పాటు పరిసర మండలాల ప్రజలకు న్యాయసేవలు మరింత చేరువ కానున్నాయి. ప్రస్తుతం చిన్న, మధ్యస్థాయి న్యాయ వ్యవహారాల కోసం మెదక్, సంగారెడ్డి, గజ్వేల్, సిద్దిపేట తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తున్న ప్రజలకు ఇక స్థానికంగానే న్యాయం అందుబాటులోకి రానుంది.

ప్రజల చిరకాల కోరిక నెరవేరుతున్న వేళ

తూప్రాన్ పట్టణం వాణిజ్య, విద్యా, పరిపాలనా కేంద్రంగా అభివృద్ధి చెందినప్పటికీ కోర్టు లేకపోవడం ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. కోర్టు ఏర్పాటుకు స్థానిక న్యాయవాదులు, ప్రజా ప్రతినిధులు, సామాజిక సంస్థలు ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తూ వచ్చారు. తాజాగా జిల్లా న్యాయమూర్తి స్వయంగా భవనాన్ని పరిశీలించడం, నిధుల మంజూరు, పనుల గడువు నిర్ణయించడం వంటి పరిణామాలతో కోర్టు ఏర్పాటు ప్రక్రియ వేగం పుంజుకుంది.

పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కల నాటకం

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయమూర్తి శ్రీమతి నీలిమ, అదనపు జిల్లా న్యాయమూర్తి సంతోష్ కుమార్‌లు ప్రతిపాదిత కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ హరితహారం కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. తూప్రాన్‌లో కోర్టు ఏర్పాటు ప్రక్రియకు జిల్లా న్యాయమూర్తి పర్యటన కీలక మలుపుగా మారగా, ఆగస్టు నాటికి కోర్టు అందుబాటులోకి వస్తుందన్న ఆశాభావం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, డీఎస్పీ నరేందర్ గౌడ్, ఎంపీడీవో సతీష్, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, మెదక్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి, న్యాయవాదులు బొడ్డు శ్రీనివాస్, ఎం. అశోక్, వేణుగోపాల్ చారి, శివకుమార్, శ్రీపతిరావు, అటవీ శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీసు, న్యాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటిన బిజెపి నాయకులు

**-ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి:**





**గాంధారి, జూన్ 5 (మహా ప్రభ)**
పర్యావరణ పరిరక్షణ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం గాంధారి మండల కేంద్రంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు, మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు, మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వహించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ కాలుష్యం కారణంగా ఉష్ణోగ్రతలు పెరగడం, అకాల వర్షాలు, వరదలు వంటి సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు, మాజీ జెడ్పిటిసి చైర్మన్ పోతంగల్ కిషన్ రావు, మండల అధ్యక్షులు మధుసూదన్ రావు, సాయిబాబా, బిజెపి కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# వహీద్ మృతి బాధాకరం

**-దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**



**దేవరకొండ జూన్ 5 ( మహా ప్రభ )**
నియోజకవర్గంలోని డిండి మండలం దాసరినెమిలిపూర్ గ్రామానికి చెందిన ఎండి.ఉస్మాన్ కుమారుడు వహీద్ మృతి బాధాకరం అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.శుక్రవారం రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించిన వహీద్ కుటుంబాన్ని హైదరాబాద్ బ్రాహ్మణపెల్లి లో మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....వహీద్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.వహీద్ ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆయన ప్రార్థించారు.ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉపూగంటి ప్రశాంత్ రావు, రామచంద్రం, వాటర్ శీను, కొండల్ రెడ్డి, నరేందర్,భగవంతు, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎం వి ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులకు ఘన సన్మానం

**దేవరకొండ జూన్ 5 ( మహా ప్రభ )**
దేవరకొండ మండలం కొండభీమనపల్లి గ్రామంలో ఎం.వి.ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మునుకుంట్ల వెంకట్ రెడ్డి విద్యావతి మునుకుంట్ల తిరుమల్ రెడ్డి ( ఎన్ఆర్ఐ ) సౌజన్యంతో నిర్వహిస్తున్న ఉచిత మెగా ఐ క్యాంపు (కంటి పరీక్షలు మరియు శస్త్రచికిత్సలు) సందర్భంగా ( ఎన్ ఆర్ ఐ ) మునుకుంట్ల తిరుమల్ రెడ్డి మరియు మున్నకుంట్ల వెంకటరెడ్డి శాల్వాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపినారు. చందంపేట మాజీ ఎంపీపీ ముత్యాల సర్వయ్య యాదవ్ , 9వార్డ్ కౌన్సిలర్ ముత్యాల రవికుమార్ యాదవ్ ట్రాన్స్ ఏ డి ఈ చందు నాయక్ , పులిపాటి సన్నీ , గుండాల వెంకట్ యాదవ్, నేనావత్ కిషన్ నాయక్, వార్డ్ నెంబర్ బత్తుల దినాకర్, పగిళ్ల చంద్రయ్య, భీనమోనీ శివ యాదవ్,

# రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని రైతు-కూలీ సంఘం పిలుపు



**మెదక్, జూన్ 5 (మహాప్రభ)**
శుక్రవారం: రైతు-కూలీ సంఘం (ఆర్‌సీఎస్) రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ నెల 9, 10 తేదీలలో హైదరాబాద్‌లోని కాచిగూడ తుల్జా భవన్‌లో జరగనున్న రాష్ట్ర సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం మెదక్ పట్టణంలోని గుల్షన్ క్లబ్‌లో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోనాల స్వామి, ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శి సూరంపల్లి మహేందర్ మాట్లాడుతూ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర సదస్సులో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని, రైతు ఆత్మహత్యల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ ఉత్పత్తి వ్యయాలు పెరుగుతున్నప్పటికీ రైతులకు సరైన ఆదాయం లభించడం లేదని, కనీస మద్దతు ధరలకు చట్టబద్ధ హామీ కల్పించాలని కోరారు. రైతు, కూలీల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రైతు-కూలీ సంఘం నాయకులు మేకల రాములు, ఎల్లం, కొట్టాల రమేష్, గౌస్, మల్లేష్, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటరత్నపూర్ లో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం.



**తూప్రాన్, జూన్ 5 (మహాప్రభ)**
తూప్రాన్ మండలం వెంకటరత్నాపూర్ గ్రామంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని గ్రామ సర్పంచ్ కీచిగారి భాగ్యలక్ష్మి, ఉప సర్పంచ్ సీత మహేష్ యాదవ్ ఆధ్వర్యం లో నిర్వహించారు. ముఖ్యంగా మన గ్రామంలోని ప్రతి ఒక్కరు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకూడదని, నీటిని పొదుపు చేయాలని, ఇంకుడు గుంతలు నిర్మాణం చేసుకోవాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రామంలోని అందరూ తమ బాధ్యతగా ఒక్కొక్కరు మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణలో మేము సైతం అంటూ ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ అన్నపూర్ణ, పాలకవర్గం సభ్యులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

## ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా పెద్దమ్మతల్లికి బోనాలు

-గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం

-అమ్మవారికి నైవేద్యాలు సమర్పించిన మహిళలు

- శివసత్తుల పూనకాలు

-పోతరాజుల విన్యాసాలు





**పాపన్నపేట, జూన్5( మహాప్రభ )**
పాపన్నపేట మండల పరిధిలోని యూసుఫ్ పేట గ్రామంలో శుక్రవారం పెద్దమ్మ తల్లి బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఉదయం నుంచే గ్రామస్తులు అమ్మవారి ఆలయంలో ఓడిబియ్యం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పురోహితుడు రమేష్ శర్మ, నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం సమయంలో మహిళలు కొత్త కుండలను రంగురంగులతో అలంకరించి, వాటిలో పసుపు, కుంకుమ, వేప ఆకులు నైవేద్యంతో సిద్ధం చేసిన బోనాలను తలపై ఎత్తుకొని మంగళహారతులు, డప్పు చప్పుల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి బోనం, సాక సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణంగా నిలిచాయి. గ్రామం చల్లగా చూడాలని, పంటలు బాగా పండాలని, అందరికీ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, గ్రామస్తులు అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం పెద్దలు ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు, మహిళలు,యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా దుర్గాప్ప గారి రాధాకృష్ణ గౌడ్ జన్మదిన వేడుకలు....






**శివంపేట,జూన్ 5 (మహాప్రభ):**
నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు దుర్గప్ప గారి రాధాకృష్ణ గౌడ్ గారి 48వ జన్మదిన వేడుకలు కేక్ కట్ చేసి శాలువాతో సన్మానం చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ప్రముఖ సంఘ సేవకులు కాంగ్రెస్ నాయకులు మెదక్ జిల్లా అధికార ప్రతినిధి బండారి గంగాధర్.ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో నిండు నూరేళ్ల జన్మదిన వేడుకలు జరుపుకోవాలని కోరుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాచునూరి శ్రీశైలం యాదవ్, కొండి దుర్గేష్, మన్నె వెంకటేశం, ఎల్ఐసి కృష్ణ. మల్లేష్,పెంటమ్మ, రాజ్ సంతోష్, కుమార్ తదితరులు పెద్దలు పాల్గొన్నారు.....

## రామాయంపేట మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపరుల ను వదిలే ప్రసక్తి లేదు



**రామాయంపేట జూన్ 5 మహాప్రభ**
రామాయంపేట మున్సిపాలిటీలో జరిగిన అవినీతి అక్రమాలపై జరిగిన బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు. మున్సిపల్ కౌన్సిలర్లు కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. చెత్తబుట్టలు. ట్రీ గార్డులు బ్లీచింగ్ పౌడర్ పాగింగ్ మిషన్. కొనుగోళ్లలో సుమారు రూ.1 60 కోట్ల మేరకు అక్రమాలు జరిగాయని ఆరోపించారు అదేవిధంగా ఎన్నికల ఖర్చుల పేరిట మరో 10 లక్షలు అవినీతి జరిగినట్టు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని తెలిపారు కీలకమైన ప్రధాన రహదారి విస్తరణ పనుల కొరకు కొందరు కావాలని అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు ప్రజల ప్రయోజనాల కోసం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ఎట్టి పరిస్థితుల లో ఆపలేరని అభివృద్ధి విషయంలో వెనుకడుగు వేయబోమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సి లార్ గజవాడ నాగరాజు . దేవుని రంజిత్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సరఫ్ యాదగిరి . కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పోచమ్మ గణేష్ దానికి స్వామి తదితరులు పాల్గొన్నారు

## పోలీస్ సిబ్బంది సంక్షేమమే మా ప్రధాన లక్ష్యం

- ఎస్పీ సునీల్ షొరాణ్




**నంద్యాల, జూన్ 5 మహాప్రభ**
పోలీస్ సిబ్బంది సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఐపీఎస్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ సంక్షేమ దినోత్సవంలో ఆయన సిబ్బంది, హోంగార్డుల వినతులను స్వయంగా స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సత్వర పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు.ఎస్పీ మాట్లాడుతూ విధుల్లో నిమగ్నమయ్యే సిబ్బంది మానసిక ప్రశాంతత, సంక్షేమం ముఖ్యం అని, సమస్యలను తొలగించడం ద్వారా వారు ప్రజలకు మెరుగైన సేవలు అందించగలరని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.సిబ్బంది సంక్షేమమే మా ప్రధాన లక్ష్యం అని ఎస్పీ సునీల్ షొరాణ్ స్పష్టం చేశారు.

# నర్సాపూర్ రాయరవు చెరువు అభివృద్ధికి రూ.2.50 కోట్లు



**శివంపెట్/నర్సాపూర్, జూన్ 5 (మహాప్రభ):**
నర్సాపూర్ పట్టణంలోని రాయరవు చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2.50 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ నిర్ణయం స్థానిక ప్రజల్లో ఆనందాన్ని కలిగించింది. నర్సాపూర్ ప్రాంత అభివృద్ధికి ఇది ఒక ముఖ్యమైన అడుగుగా భావిస్తున్నారు. ఈ నిధుల మంజూరులో వాకిటి సునీత లక్ష్మారెడ్డి కీలక పాత్ర పోషించినట్లు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు తెలిపారు.
రాయరవు చెరువు ప్రాంతంలో ఉన్న సహజ వనరులు, ప్రకృతి సౌందర్యాన్ని దృష్టిలో ఉంచుకుని దీనిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనను ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.
రాయరవు చెరువు నర్సాపూర్ పట్టణానికి సమీపంలో రెండు కొండల మధ్య విస్తరించి ఉంది. చుట్టూ అటవీ ప్రాంతం ఉండటంతో ఈ ప్రాంతం సహజసిద్ధమైన అందాలకు నిలయంగా పేరుగాంచింది. ప్రశాంత వాతావరణం, పచ్చని ప్రకృతి, చెరువు అందాలు సందర్శకులను ఆకట్టుకునేలా ఉంటాయి. అయితే ఇప్పటివరకు సరైన మౌలిక వసతులు లేకపోవడంతో ఈ ప్రాంతం పర్యాటకంగా పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందలేదు. ఇప్పుడు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2.50 కోట్ల నిధులతో చెరువు పరిసరాల సుందరీకరణ, నడక మార్గాలు, విశ్రాంతి కేంద్రాలు, వీక్షణ స్థలాలు, విద్యుత్ వెలుగులు, పచ్చదనం పెంపు వంటి పనులు చేపట్టే అవకాశం ఉంది. అలాగే పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కూడా అభివృద్ధి చేసే అవకాశం ఉంది.
ఈ ప్రాజెక్టు పూర్తయితే రాయరవు చెరువు ప్రాంతం జిల్లాలో ఒక ప్రముఖ పర్యాటక ఆకర్షణగా మారడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. అలాగే నర్సాపూర్ ప్రాంత ఆర్థికాభివృద్ధికి, పర్యాటక రంగ విస్తరణకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని అధికారులు, ప్రజాప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటుట.



**మెదక్ జిల్లా,-05జూన్ (మహాప్రభ ).**
ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వదేశీ జాగరణ మంచ్ మెదక్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. భవాని మాట్లాడుతూ, మొక్కలు నాటడం ద్వారా ప్రకృతిని పరిరక్షించుకోవడంతో పాటు మన జీవన విధానానికి ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. నాటిన మొక్కలను సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. డాక్టర్ ఎస్. నారాయణ గుప్తా మాట్లాడుతూ, స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని అన్నారు. మనము పర్యావరణాన్ని పరిరక్షిస్తే, పర్యావరణం మనల్ని రక్షిస్తుందని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యతను స్వీకరించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే మొక్కల పెంపకం మరియు వాటి సంరక్షణ అత్యంత అవసరమని ఆయన వివరించారు.
ఈ కార్యక్రమంలో అధ్యాపకురాలు మేఘ జ్యోతి, చేగుంట పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ చక్రవర్తి, గోమారం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ నారాయణ, నాన్-టీచింగ్ సిబ్బంది సుదర్శన్, శరన్,పుష్ప, రేణుక, పాల్గొన్నారు. అలాగే స్వదేశీ జాగరణ మంచ్ తెలంగాణ సంపర్క్ ప్రముఖ్ డాక్టర్ నారాయణ గుప్తా, మెదక్ జిల్లా కన్వీనర్ విజయ్ కుమార్, కో-కన్వీనర్ కిషన్ ప్రసాద్, న్యాయవాది కరణ్, రామకృష్ణ, అధ్యాపకులు రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, దుర్గయ్య తదితరులు హాజరై మొక్కలు నాటారు.
పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కార్యక్రమంలో పాల్గొన్న వారు పిలుపునిచ్చారు.

# ఏక్ పెడ్ మాకే నామ్ పే. కార్యక్రమం లో యం పి రఘునందన్ రావు.



**మెదక్ జిల్లా 05జూన్ (మహాప్రభ ).**
మెదక్‌లో ఘనంగా అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం – 'ఏక్ పెడ్ మాకే నామ్ పే' కార్యక్రమంలో ఎంపీ రఘునందన్ రావు పాల్గొన్నారు.
అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా, భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం ఘనంగా జరిగింది.బి జె పి జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని, 'ఏక్ పెడ్ మాకే నామ్ పే' (తల్లి పేరు మీద ఒక మొక్క) కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.
**కార్యక్రమంలో ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ:**
-ప్రతి బూత్ స్థాయిలో పార్టీ కార్యకర్తలు, ప్రజలు తప్పనిసరిగా 'ఏక్ పెడ్ మాకే నామ్ పే'లో భాగంగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు.
-ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి, జూన్ 10వ తేదీ నాటికి 12 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.
-పర్యావరణ సమతుల్యత కోసం త్వరలోనే మెదక్ – ఎల్కతుర్తి జాతీయ రహదారికి ఇరువైపులా భారీ ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఎంపీ ప్రకటించారు.
-ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఈర్ల రంజిత్ రెడ్డి, సంఘసాని సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు శంకర్ గౌడ్, కార్యదర్శి కల్కి నాగరాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, పబ్బా సత్యనారాయణ, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఎల్.ఎన్. రెడ్డి, పట్టణాధ్యక్షులు నాయిని ప్రసాద్, సర్పంచ్ బెండవీణ, కౌన్సిలర్ అఖిల భరత్, మండల అధ్యక్షులు సంతోష్ చారి, శ్రీనివాస్, హరీష్ తదితర సీనియర్ నాయకులు, జిల్లా శాఖ పదాధికారులు పాల్గొన్నారు.

## దొంగతనం కేసును చేదించిన వెల్దుర్తి పోలీసులు.



**మెదక్ జిల్లావెల్దుర్తి, జూన్ 5 (మహాప్రభ)**
వెల్దుర్తి మండల్ సెంట్రల్ బ్యాంక్ వద్ద నేరస్తులు శ్రీకాంత్, శైలని ఇద్దరు కలిసి ఫిర్యాదిరాలు రాజమ్మను ఆటోలో ఎక్కించుకొని ఆరేగుడెం లో దించుతామని నమ్మబలికి బస్వాపూర్ గ్రామ శివార్ లోని చెరువు కట్ట ప్రాంతంలో తీసుకొని వెళ్ళి కత్తితో బెదిరించి రాజమ్మ యొక్క బంగారు చెవి కమ్మలు బలవంతముగా లాక్కొని పరిపోవడం జరిగింది. ఈ కేసు విషయంలో శుక్రవారం నేరస్తులను తూప్రాన్ లో గల నర్సాపూర్ తూప్రాన్ బ్రిడ్జ్ వద్ద పట్టుకొని అరెస్ట్ చేసి స్వాదినపరుచుకున్నాం. వస్తువులు నేరస్థుడు మద్దూరు శ్రీకాంత్ వద్ద ఆటో నెం. టీజీ. 35 టి 0627 దొంగిలించిన బంగారు చెవి కమ్మలు కృష్ణ జేవెలరీ షాప్ కొత్తూరు వద్ద స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ కేసుని ఛేదించిన తూప్రాన్ సిఐ. ఆశయం వెంకట్రాజ గౌడ్, ఎల్దుర్తి ఎస్సై జ్యోతి, వారి సిబ్బంది పి. గోవర్ధన్ రావు, కృష్ణ, సురేష్ మరియు మహేష్ లను తూప్రాన్ డి.ఎస్.పి. అభినందించారు, దీనికి తగిన రివార్డ్స్ అందిస్తామని హామీ ఇచ్చారు.

## గ్రామీణ అభివృద్ధి శాఖ లక్ష్యాలను సాధించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.






**మెదక్ జిల్లా -05జూన్ (మహాప్రభ ).**
గ్రామీణ అభివృద్ధి శాఖ 2026-2027 సంవత్సరానికి శాఖ లక్ష్యాలను సాధించాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని మీటింగ్ హాల్లో గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నూతన మహిళ సంఘాల నమోదు, శ్రీనిధి లోన్స్,ధాన్యం కొనుగోళ్లు,ఇందిరా మహిళా చీరల పంపిణీ,గోదాములు, వ్యవసాయ ఉత్పత్తులు, సోలార్ పంపు సెట్లు, పెట్రోల్ బంకులు, చేయూత పింఛన్ల లో లక్ష్యాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాసరావు, అడిషనల్ గ్రామీణ అభివృద్ధి అధికారి సరస్వతి, శాఖల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## స్టాక్‌మార్కెట్.. ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు



దేశీయ మార్కెట్లు శుక్రవారం నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు, ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాల నేపథ్యంలో సూచీల్లో ఊగిసలాట కనిపించింది. ఐటీ, మెటల్ రంగాల షేర్లు నష్టపోయాయి. సెన్సెక్స్ 116 పాయింట్లు కోల్పోయి 74,243 వద్ద, నిఫ్టీ 49 పాయింట్లు నష్టపోయి 23,366 వద్ద స్థిరపడ్డాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 94.94 వద్ద కొనసాగుతోంది.

## పెరగనున్న మొబైల్ రీఛార్జ్ ధరలు

మొబైల్ యూజర్లకు మరోసారి రీఛార్జ్ ధరల షాక్ తగలనుంది. రానున్న 3-6 నెలల్లో కంపెనీలు టారిఫ్‌లను పెంచే అవకాశం ఉందని యాక్సిస్ క్యాపిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గౌరవ్ మల్హోత్రా వెల్లడించారు. 10 శాతంలోపే టారిఫ్ ఛార్జీలు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే నిత్యావసర సరుకులు, ఇంధన ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఇది మరింత భారం కానుందని విశ్లేషకులు చెబుతున్నారు.




## బంగారం, వెండి ధరలు తగ్గాయోచ్!

### తులంపై ఎంత తగ్గిందంటే..?

హైదరాబాద్‌లో బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్లలో విలువైన లోహాల ధరలు బలంగా ఉండటంతో నగరంలోని బంగారం ధరలు పెద్ద మొత్తంలో తగ్గకపోయినా.. నిన్నటితో పోలిస్తే కాస్త ధర తగ్గింది. జూన్ 5, 2026 నాటికి 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర గ్రాముకు రూ. 15,610గా ఉండగా, 10 గ్రాముల ధర సుమారు రూ. 1,58,117కు చేరుకుంది. అదే సమయంలో 22 క్యారెట్ల బంగారం గ్రాము ధర రూ. 14,309గా నమోదై, 10 గ్రాముల ధర రూ. 1,43,100 వరకు ఉంది. ఆభరణాల తయారీలో విస్తృతంగా ఉపయోగించే 18 క్యారెట్ల బంగారం గ్రాము ధర రూ. 11,707గా ఉంది. వెండి ధరలు కూడా స్వల్పంగానే తగ్గాయి. హైదరాబాద్ మార్కెట్‌లో గ్రాము వెండి ధర రూ. 284.90గా ఉండగా, కిలో వెండి ధర సుమారు రూ. 2,84,900కు చేరుకుంది. వివాహాలు, శుభకార్యాల సీజన్ నేపథ్యంలో బంగారం, వెండి కొనుగోళ్లకు డిమాండ్ కొనసాగుతున్నప్పటికీ, ధరలు తగ్గడం విశేషం. అంతర్జాతీయ బంగారం ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణ ఆందోళనలు, ప్రపంచ ఆర్థిక



అనిశ్చిత పరిస్థితులు, కేంద్ర బ్యాంకుల బంగారం నిల్వల కొనుగోళ్లు, డాలర్ మారకపు విలువలో హెచ్చుతగ్గులు వంటి అంశాలు బంగారం ధరలను ప్రభావితం చేస్తున్నాయి. అంతేకాకుండా, వడ్డీ రేట్లపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న అంచనాలు కూడా బులియన్ మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. బంగారం ధరలు ఇప్పటికే చరిత్రాత్మక గరిష్ఠ స్థాయిల వద్ద ఉండటంతో పెట్టుబడిదారులు జాగ్రత్తగా వ్యవహరించాలని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. ఆభరణాల కొనుగోలు చేసే వారు బంగారం ధరలతో పాటు మేకింగ్ ఛార్జీలు, జీఎస్టీ వంటి అదనపు ఖర్చులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని చెబుతున్నారు. రాబోయే రోజుల్లో అంతర్జాతీయ మార్కెట్ ధోరణులను బట్టి ధరల్లో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## వన్డే సిరీస్‌కు విరాట్ కోహ్లీ దూరం!


భారత బ్యాటింగ్ సూపర్ స్టార్ విరాట్ కోహ్లీ క్రికెట్ అభిమానులకు గట్టి షాక్ ఇచ్చారు. హ్యామ్‌స్ట్రింగ్ గాయం కారణంగా ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న మూడు వన్డేల సిరీస్ మొత్తానికి ఆయన దూరమయ్యారు. ఈ విషయాన్ని ప్రముఖ వార్తా సంస్థ పీటీఐ గురువారం (జూన్ 4) వెల్లడించింది. ఇటీవల ఆదివారం (మే 31) జరిగిన ఐపీఎల్ 2026 ఫైనల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున గుజరాత్ టైటాన్స్‌పై 42 బంతుల్లో 75 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు గెలుచుకున్న 37 ఏళ్ల కోహ్లీ.. అదే మ్యాచ్‌లో గాయపడ్డారు. ఫలితంగా ఆఫ్ఘనిస్తాన్‌తో భారత్ ఆడబోతున్న మొట్టమొదటి ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లో ఆయన భాగం కాలేకపోతున్నారు.హ్యామ్‌స్ట్రింగ్ గాయం కారణంగా కోహ్లీ వన్డే సిరీస్‌కు దూరం కావలసి వచ్చింది. ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌లోనే ఆయనకు ఈ గాయమైంది. స్కానింగ్ రిపోర్టులలో ఆయనకు 'డిస్టల్ సెమీమెంబ్రానోసస్ టెండన్ టియర్'అయినట్లు తేలింది" అని బీసీసీఐ వర్గాలు పీటీఐతో పేర్కొన్నాయి. ఇది మోకాలి వెనుక భాగం కింద ఉండే హ్యామ్‌స్ట్రింగ్



కండరాలను అనుసంధానించే దట్టమైన నరానికి సంబంధించిన ఒక అరుదైన గాయం. అయితే కోహ్లీ గాయంపై మరియు సిరీస్ నుండి ఆయన తప్పుకోవడంపై బీసీసీఐ అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. విరాట్ కోహ్లీ దూరం కావడంతో ఆయన స్థానంలో యశస్వి జైస్వాల్ లేదా రుతురాజ్ గైక్వాడ్‌లను జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. న్యూజీలాండ్‌తో జరిగిన గత వన్డే సిరీస్‌లో జైస్వాల్ జట్టులో ఉన్నప్పటికీ ఆడే అవకాశం రాలేదు. మరోవైపు గైక్వాడ్ గత ఏడాది దక్షిణాఫ్రికా సిరీస్‌లో మిడిల్ ఆర్డర్‌లో ఆకట్టుకున్నాడు. అయితే, ప్రస్తుతం గైక్వాడ్ శ్రీలంకలో జరగబోయే త్రైపాక్షిక సిరీస్ కోసం 'ఇండియా ఎ' జట్టులో ఉన్నాడు. మాజీ కెప్టెన్ రోహిత్ శర్మను మే 19నే ఈ చారిత్రక హోమ్ సిరీస్ కోసం ఎంపిక చేశారు. అయితే ఐపీఎల్ 2026లో హ్యామ్‌స్ట్రింగ్ గాయంతో బాధపడిన రోహిత్.. ఫిట్‌నెస్ సాధిస్తేనే ఆడతాడనే నిబంధనతో జట్టులోకి తీసుకున్నారు. ఆయన ఈ సిరీస్ మొత్తానికి అందుబాటులో ఉంటాడా లేదా అనేది ఇంకా చూడాల్సి ఉంది.

## ఘోరంగా విఫలమైన లివింగ్ స్టోన్

ఐపీఎల్ 2026 మెగా వేలంలో ఆటగాళ్లపై ఫ్రాంచైజీలు కోట్ల వర్షం కురిపించిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ యజమాని కావ్య మారన్ ఇంగ్లాండ్ విధ్వంసకర ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్ స్టోన్‌ను ఏకంగా రూ. 13 కోట్లకు సొంతం చేసుకుంది. మిడిల్ ఆర్డర్‌లో అతడు సిక్సర్ల వర్షం కురిపిస్తాడని ఫ్రాంచైజీ ఎన్నో ఆశలు పెట్టుకుంది. కానీ, తీరా ఐపీఎల్ 2026 సీజన్ ముగిసేసరికి కావ్య మారన్ తీసుకున్న ఈ నిర్ణయం ఎంత పెద్ద తప్పో అర్థమైందని క్రికెట్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ సీజన్‌లో లివింగ్ స్టోన్ ఘోరంగా విఫలమయ్యాడు. సన్‌రైజర్స్ తరఫున కేవలం రెండంటే రెండు మ్యాచ్‌ల్లో మాత్రమే అతడికి ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగే అవకాశం దక్కింది. ఆ రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి అతడు చేసింది కేవలం 15 పరుగులు మాత్రమే. మిగిలిన బ్యాటర్లు పరుగుల వరద పారిస్తున్న వేళ లివింగ్ స్టోన్ తడబడటంతో, మేనేజ్‌మెంట్ అతడిని మిగతా మ్యాచ్‌లన్నింటికీ బెంచ్‌కే పరిమితం చేయాల్సి వచ్చింది. అయితే ఐపీఎల్ ముగిసిన తర్వాత లివింగ్ స్టోన్ సన్ రైజర్స్ హైదరాబాద్‌పై సంచలన కామెంట్స్ చేశాడు. తమ తుది జట్టు ఎంపికలో యాజమాన్యం



జోక్యం ఉంటుందని లివింగ్‌స్టోన్ వ్యాఖ్యానించాడు. కేవలం ముగ్గురే విదేశీ క్రికెటర్లను ఆడించిన ఫ్రాంచైజీ.. తనకు అవకాశాలు మాత్రం ఇవ్వలేదని పేర్కొన్నాడు.అతడికి వేలంలో దక్కిన ధర (రూ. 13 కోట్లు), అతడు చేసిన పరుగులను (15 రన్స్) పోల్చి చూస్తూ సోషల్ మీడియాలో నెటిజన్లు దారుణంగా ట్రోల్ చేస్తున్నారు. దాదాపు ఒక్కో పరుగుకు కోటి రూపాయల చొప్పున లివింగ్ స్టోన్ వసూలు చేశాడంటూ కామెంట్లు పెడుతున్నారు. పేలవ ఫామ్‌తో సతమతమవుతున్న ఇతడిని వచ్చే సీజన్ కోసం జట్టులో కొనసాగించడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ తదుపరి మినీ వేలానికి ముందే అతడిని జట్టు నుంచి విడుదలచేసే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆ రూ. 13 కోట్ల పర్స్ మనీతో వేలంలో మరొక మంచి ఫామ్‌లో ఉన్న ఆటగాడిని కొనుగోలు చేయవచ్చని ఫ్రాంచైజీ భావిస్తున్నట్లు సమాచారం.

# స్పోర్ట్స్

## శ్రీలంకలో అడుగుపెట్టిన ఇండియా-ఏ టీమ్..

### భారత్, శ్రీలంక, అఫ్ఘనిస్థాన్ మధ్య ట్రై సిరీస్



శ్రీలంక వేదికగా ఓ ట్రై సిరీస్‌ను బీసీసీఐ ప్లాన్ చేసింది. భారత్, శ్రీలంక, అఫ్ఘనిస్థాన్ దేశాల 'ఏ' జట్లను ఈ సిరీస్ కోసం ఎంపిక చేశారు. జూన్ 9 నుంచి మొదలయ్యే ఈ సిరీస్ జూన్ 21 వరకు సాగుతోంది. ఈ సిరీస్ కోసం ఇండియా ఏ జట్టు శ్రీలంకలో అడుగుపెట్టింది. ఈ సిరీస్‌లో అందరి దృష్టి ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీ మీదే ఉంది. ఈ సిరీస్‌లో భారత్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీ శ్రీలంక గడ్డపై అడుగుపెట్టాడు. ఐపీఎల్ 2026లో విధ్వంసం సృష్టించిన 15 ఏళ్ల వైభవ్.. ఇప్పుడు ఇంటర్నేషనల్‌లో తన సత్తా చాటేందుకు సిద్ధమయ్యాడు. శ్రీలంక వేదికగా జరగనున్న ట్రై సిరీస్ కోసం ఇండియా ఏ జట్టు శ్రీలంక చేరుకుంది. మొత్తం ఏడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్, శ్రీలంక, అఫ్ఘనిస్థాన్ దేశాలు పాల్గొంటున్నాయి. భారత్, శ్రీలంక, అఫ్ఘనిస్థాన్ దేశాల మధ్య ట్రై సిరీస్ జరగనుంది. ఈ మూడు దేశాల ఏ కేటగిరి జట్లు ఈ ట్రై సిరీస్‌లో పాల్గొంటున్నాయి. ఈ సిరీస్‌కు శ్రీలంక ఆతిథ్యమివ్వనుంది. వన్డే ఫార్మాట్‌లో జరిగే ఈ సిరీస్ రానున్న ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ కోసం యువ ఆటగాళ్లను ఎంపిక చేసేందుకు ఉపయోగపడనుంది. ఈ సిరీస్‌లో ఐపీఎల్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఇండియా ఏ జట్టుకు తిలక్ వర్మ కెప్టెన్‌గా వ్యవహరించనుండటం విశేషం. వైస్ కెప్టెన్‌గా ఎంపికైన రియాన్ పరాగ్ గాయం కారణంగా సిరీస్‌కు దూరమయ్యాడు. దాంతో వైస్ కెప్టెన్‌గా రుతురాజ్ గైక్వాడ్‌ను ఎంపిక చేశారు. బీసీసీఐ చెప్పిన ప్రకారం వన్డే ట్రై సిరీస్ మ్యాచ్‌లు డంబుల్లాలో జరుగుతాయి. ఈ సిరీస్ ముగిసిన వెంటనే ఇండియా - ఏ, శ్రీలంక - ఏ జట్ల మధ్య రెండు రోజుల రెడ్ బాల్ మ్యాచ్‌లు గాలేలో నిర్వహించనున్నారు. ఈ సిరీస్‌కు సంబంధించి భారత జట్టును ఇంకా ప్రకటించలేదు.

# దేశాన్ని కదిలించే నిజాలతో వస్తున్న కాజల్ 'ది ఇండియా స్టోరీ'..

## టీజర్ విడుదల!





భారతదేశంలో జరిగిన కొన్ని నమ్మలేని సంచలన నిజాల ఆధారంగా తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ అండ్ హార్డ్ హిట్టింగ్ మూవీ 'ది ఇండియా స్టోరీ' . 'స్లో పాయిజన్ ఇన్ ప్రోగ్రెస్' అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా, శ్రేయాస్ తల్పాడే కీలక పాత్రలో నటిస్తున్నాడు. సాగర్ బీ దేశ్‌పాండే దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీతో పాటు టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం.ఈ చిత్రం 2026 జూలై 24న ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలో విడుదల కానుంది. దేశవ్యాప్తంగా ఉన్న సినిమా ప్రియులను ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని హిందీ, తమిళం మరియు తెలుగు భాషల్లో ఒకేసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఇక టీజర్ చూస్తుంటే.. సమాజంలో దాగి ఉన్న అత్యంత దిగ్భ్రాంతికరమైన నిజాలను, తెరవెనుక జరిగిన పరిణామాలను కళ్లకు కట్టినట్లు చూపించబోతున్నామని చిత్ర యూనిట్ ఈ సందర్భంగా ప్రకటించింది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్ సామాజిక మాధ్యమాల్లో విపరీతమైన ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఒక విలక్షణమైన కథాంశంతో, ప్రేక్షకులను ఆలోచింపజేసే సస్పెన్స్ డ్రామాగా ఈ సినిమాను రూపొందించినట్లు తెలుస్తోంది

# పెద్ది బాక్సాఫ్ కలెక్షన్ల సునామి

# తొలిరోజే రూ.135.36 కోట్లు వసూలు

## బాక్సాఫీస్ ఛాంపియన్' అంటూ పోస్టర్ విడుదల




ఆటలోనూ, పోరాటంలోనూ ఛాంపియన్ అనిపించుకున్నాడు 'పెద్ది'. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కించిన ఈ సినిమా తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చి హిట్‌గా నిలిచింది. పెద్దిగా రామ్ చరణ్ తన నటనతో మెప్పిస్తుండగా.. చాలా రోజుల తర్వాత ఆయన ఖాతాలో హిట్ పడిందంటూ అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. ఈ సినిమా మొదటి రోజు కలెక్షన్స్‌ను నిర్మాణ సంస్థ తాజాగా వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఫస్ట్‌డే రూ.135.36 కోట్లు వసూలుచేసినట్లు అధికారికంగా ప్రకటించింది. 'బాక్సాఫీస్ ఛాంపియన్' అంటూ పోస్టర్ విడుదల చేసింది. 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద తొలిరోజే కలెక్షన్ల సునామీ సృష్టించింది. గురువారం ప్రపంచవ్యాప్తంగా అత్యంత భారీ స్థాయిలో విడుదలైన ఈ చిత్రం మొదటి రోజే ఏకంగా రూ. 135.36 కోట్ల గ్రాస్ వసూలు చేసి సరికొత్త రికార్డులను సృష్టించినట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ అద్భుతమైన ఓపెనింగ్స్‌తో భారతీయ చిత్ర పరిశ్రమలో సరికొత్త సంచలనం సృష్టించింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చిత్రం ఇండియాలో గురువారం నాడు సుమారు రూ. 51 కోట్ల నెట్ కలెక్షన్స్ సాధించగా, బుధవారం నాటి పెయిడ్ ప్రివ్యూల ద్వారా మరో రూ. 18.50 కోట్లు రాబట్టింది. దీనితో మొత్తంగా ఇండియా నెట్ కలెక్షన్ రూ. 69.50 కోట్లకు చేరింది. ఇక ఇండియా గ్రాస్ కలెక్షన్ దాదాపు రూ. 82.49 కోట్లుగా నమోదు కాగా, ఓవర్సీస్ గ్రాస్ సుమారు రూ. 30 కోట్లుగా ఉంది. మరోవైపు వర్కింగ్ డే అయినప్పటికీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలోని థియేటర్లలో దాదాపు 68 శాతం ఆక్యుపెన్సీతో ప్రేక్షకులు థియేటర్లకు బారులు తీరారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, జియో స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ కథానాయికగా నటించగా, కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, బొమన్ ఇరానీ, జగపతి బాబు, దివ్యేందు ముఖ్య పాత్రలు పోషించారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందించిన అద్భుతమైన సంగీతం, రత్నవేలు సినిమాటోగ్రఫీ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. రామ్ చరణ్ అభిమానులతో పాటు సాధారణ ప్రేక్షకులు కూడా ఈ చిత్రానికి బ్రహ్మరథం పడుతుండటంతో, వీకెండ్ ముగిసే సరికి ఈ కలెక్షన్ల జోరు మరిన్ని రికార్డులను తిరగరాయడం ఖాయమని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. విజయనగరం జిల్లాలోని కొండ కింద ఊరు అది. వందల మంది జీవనం సాగిస్తున్నా, ప్రభుత్వ రికార్డుల్లో ఆ ఊరికి గుర్తింపు అన్నదే ఉండదు. అందుకే ఆ ఊరు అన్నా, అక్కడి నుంచి వచ్చిన మనుషులన్నా అందరికీ చిన్న చూపు. ఆ ఊళ్లో పుట్టి పెరిగినవాడే పెద్ది (రామ్‌చరణ్). రోజూ విజయనగరం వెళ్లి కూలి పనులు చేసుకుంటుంటాడు. పేరుకి కూలి అయినా క్రికెట్‌లో మాత్రం రాటుదేలిన ఆటగాడు. అందుకే విజయనగరం, బొబ్బిలి క్రికెట్ జట్లు వేలంలో పెద్దిని కొనేందుకు పోటీపడుతుంటారు. అలాంటి ఆటగాడు క్రికెట్‌ని వదిలి కుస్తీ క్రీడాకారుడిగా ఎందుకు మారాల్సివచ్చింది? పెద్ది ప్రయాణంపై అప్పలసూరి (జగపతిబాబు), గౌర్‌నాయుడు (శివరాజ్‌కుమార్) ఎలాంటి ప్రభావం చూపించారు? ఈ కథలో అచ్చియమ్మ (జాన్వీ కపూర్) ఎవరు? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.




# పెద్దిలో జాన్వీ పాత్రపై విమర్శలు

## సరైన ప్రాధాన్యం లేదంటూ సోషల మీడియా పోస్ట్ జాన్వీ లైక్ కొట్టడంతో మరింత దుమారం

నటి జాన్వీకపూర్ ఒక ఇన్‌స్టా పోస్ట్‌కు చేసిన లైక్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన 'పెద్ది' తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చింది. దీనికి సంబంధించి ఇన్‌స్టాలో ఓ పేజ్ పెట్టిన రివ్యూను జాన్వీకపూర్ లైక్ చేశారు. అయితే ఆ రివ్యూలో జాన్వీకపూర్ పాత్రకు సరైన ప్రాధాన్యం దక్కలేదని రాశారు. 'పెద్ది: భారతీయ సినిమా చరిత్రలో ఒక కథానాయికకి జరిగిన అత్యంత అవమానం' అని హెడ్డింగ్ పెట్టారు. దీన్ని జాన్వీ లైక్ చేయడం ఒక్కసారిగా హాట్ టాపిక్‌గా మారింది. తన పాత్రకు ప్రాధాన్యం దక్కలేదని జాన్వీ స్వయంగా సమర్థించారని కొందరు అంటుంటే.. పొరపాటున కొట్టి ఉంటారని మరికొందరు భావిస్తున్నారు. ఈ వార్తలు రావడంతో జాన్వీ ఆ పోస్ట్‌ను అన్‌లైక్ చేశారు. అయితే ఈలోపే దీనికి సంబంధించిన స్క్రీన్‌షాట్‌లు నెట్టింట ప్రత్యక్షమయ్యాయి. రూ.350 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రంలో జాన్వీకపూర్ 'అచ్చియమ్మ' పాత్రలో కనిపించిన విషయం తెలిసిందే. ఇక భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా తొలిరోజు కలెక్షన్లలో జోరు చూపించింది. మొదటి రోజు ప్రీమియర్స్‌తో కలిపి రూ.135 కోట్లు వసూలు చేసింది.


# సుదీర్ఘ కాలం తరవాత వైష్ణవ్ తేజ్ మూవీకి ఓకే



'ఉప్పెన' సినిమాతో టాలీవుడ్‌లోకి బ్లాక్‌బస్టర్ ఎంట్రీ ఇచ్చిన మెగా హీరో పంజా వైష్ణవ్ తేజ్, గత కొంతకాలంగా ఆశించిన స్థాయిలో విజయాలు లేకపోవడంతో తన తదుపరి ప్రాజెక్ట్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సాలిడ్ హిట్‌తో మళ్లీ ట్రాక్‌లోకి ఎక్కాలనే పట్టుదలతో ఉన్న ఈ యంగ్ హీరో, కథల ఎంపిక కోసం గత మూడు సంవత్సరాలలో ఏకంగా 100కు పైగా స్క్రిప్ట్‌లను తిరస్కరించినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో గట్టి టాక్ నడుస్తోంది. అయితే ఎట్టకేలకు ఈ సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ వైష్ణవ్ తేజ్ తన తదుపరి సినిమాను అధికారికంగా ఖరారు చేశారు. యువ దర్శకుడు మహేష్ ఎస్ చెప్పిన ఒక కథ ఈ యంగ్ హీరోను ఎంతగానో ఆకట్టుకోవడంతో ఆయన వెంటనే ఈ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తుంది. గతంలో సుధీర్ బాబు హీరోగా వచ్చిన 'హంట్' చిత్రానికి మహేష్ ఎస్ దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే. టాలీవుడ్‌లో వరుస క్రేజీ చిత్రాలను నిర్మిస్తున్న ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ సినిమాను భారీ బ్జడెట్‌తో నిర్మించనుంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే నెలలో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటనతో పాటు మిగిలిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను చిత్ర యూనిట్ వెల్లడించనుంది. ఆ వెంటనే సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను కూడా ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత ఎంతో ఆలోచించి వైష్ణవ్ తేజ్ ఓకే చేసిన ప్రాజెక్ట్ కావడంతో మెగా అభిమానుల్లో ఈ సినిమాపై అప్పుడే భారీ అంచనాలు నెలకొన్నాయి.

# దూత వెబ్ సీరిస్‌కు నిర్మాతగా నాగచైతన్య

'దూత' వెబ్‌సిరీస్‌తో తొలి ప్రయత్నంలోనే విజయాన్ని అందుకున్నారు నటుడు నాగచైతన్య. ఇప్పుడు ఈ హిట్ సిరీస్‌కు సీక్వెల్ సిద్ధమవుతోంది. శుక్రవారం పూజా కార్యక్రమాలు జరగ్గా.. నాగార్జున క్లాప్ కొట్టి దీన్ని ప్రారంభించారు. ఈ సీక్వెల్‌కు నాగచైతన్య నిర్మాతగా వ్యవహరించనుండటం విశేషం. 'దూత సెకండ్ చాప్టర్‌లో నిర్మాతగా నా తొలి అడుగు' అంటూ నాగచైతన్య ఫొటోలు పంచుకున్నారు. మరోసారి మ్యాజిక్ చూడడానికి సిద్ధంగా ఉండాలని కోరారు. విక్రమ్ కె. కుమార్ దర్శకత్వంలో రూపొందిన 'దూత'.. 2023 డిసెంబరు 1న 'అమెజాన్ ప్రైమ్ వీడియో'లో విడుదలై పలు రికార్డులు సొంతం చేసుకుంది. ఈ హారర్ మిస్టరీ థ్రిల్లర్‌లో జర్నలిస్టు సాగర్ వర్మ అవధూరిగా నాగచైతన్య ఆకట్టుకున్నారు.



Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com